



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్



IRS PUBLICATIONS

irspublications12@gmail.com



సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 97 | సోమవారం 08 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం?




- అక్టోబర్‌లో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దక్షిణ కొరియా పర్యటన
- ఏపీఈసీ సదస్సులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీకి అవకాశం
- వాణిజ్య యుద్ధం, ఆర్థిక పెట్టుబడులపై చర్చలు జరిపే యోచన
- ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తోనూ సమావేశమయ్యే ఛాన్స్
- భేటీకి తాను సిద్ధమేనని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య మరో కీలక భేటీకి రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అక్టోబర్‌లో దక్షిణ కొరియాలో జరగనున్న ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సులో పాల్గొనేందుకు ట్రంప్, ఆయన ఉన్నతాధికారులు రహస్యంగా సన్నాహాలు - మిగతా 2లో..

## అరుణవర్ణంలో చంద్రబింబం..



- ఆకాశంలో అద్భుత దృశ్యం
- దేశవ్యాప్తంగా సంపూర్ణ చంద్రగ్రహణం
- ఆదివారం రాత్రి 11 గంటలకు మొదలు
- మేఘావృతంతో పలుచోట్ల నిరాశ



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. ప్రపంచవ్యాప్తంగా భారత్‌తో పాటు అనేక దేశాల్లో చంద్రగ్రహణం కనిపించింది. గ్రహణ ప్రారంభవేళ అరుణవర్ణంలో చంద్రబింబం అలరించింది. తదనంతరం నెమ్మదిగా గ్రహణం విస్తరించడంతో చంద్ర హారాయలు మరింత శోభతో ఆకట్టుకున్నాయి. అయితే మేఘావృతంతో పలుచోట్ల గ్రహణ వీక్షకులకు తీవ్ర నిరాశ ఎదురైంది. జనవిజ్ఞానవేదిక (జెవివి) వంటి సంఘాలు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మరోవైపు గ్రహణం వేళల్లో దేశవ్యాప్తంగా ఆలయాలన్నింటిని మూసివేశారు. తిరుమల, విజయవాడ, శ్రీశైలం ఆలయ ప్రధాన ద్వారాలకు తాళాలు వేశారు. భారత్‌లో ఆదివారం రాత్రి 9.56 గంటలకు ఇది ప్రారంభమైంది. ఇక రాత్రి 11 గంటలకు 'సంపూర్ణ చంద్రగ్రహణం' మొదలైంది. ఇది తర్వాతి రోజు (సోమవారం) ఉదయం 12.22 గంటలకు - మిగతా 2లో..

## ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు
- అనర్హత వేటుపై తదుపరి కార్యాచరణపై కీలక చర్చలు
- సమావేశానికి గైర్హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో పెరిగిన రాజకీయ ఉత్కంఠ



హైదరాబాద్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ అనర్హత నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆదివారం జరిగిన ఈ భేటీలో తదుపరి అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే. ఈ నోటీసులపై వివరణ ఇచ్చేందుకు - మిగతా 2లో..



## ఏపీలో పెట్టుబడులు పెట్టండి

- కోయంబత్తూరు పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేశ్ భేటీ - స్థానిక పారిశ్రామికవేత్తలతో ప్రత్యేక సమావేశం - పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతుల హామీ - లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్ - డీపీఆర్‌తో వస్తే చాలు.. మిగతా బాధ్యత ప్రభుత్వానిదేనని వెల్లడి

కోయంబత్తూరు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కోయంబత్తూరు చేరుకున్నారు. కోయంబత్తూరు ఎయిర్ పోర్టులో తమిళనాడు బీజేపీ నేత అమర్ ప్రసాద్ రెడ్డి, అక్కడి తెలుగు ప్రజలు మంత్రి లోకేశ్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోయంబత్తూరులోని పారిశ్రామికవేత్తలతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులకు పూర్తి అనుకూల వాతావరణం నెలకొని ఉందని తెలిపారు. పరిశ్రమలకు సింగిల్ విండో అనుమతులతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్, ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ - మిగతా 2లో..

## రాష్ట్రపతికి ప్రధాని బ్రీఫింగ్



- మోదీ పాటిస్తున్న సంప్రదాయం..
- రాజీవ్ గాంధీ విస్మరించిన వైనం!
- విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని మోదీ భేటీ - ప్రతి పర్యటన తర్వాత రాష్ట్రపతికి వివరించడం మోదీకి అలవాటు
- మోదీ తీరును రాజీవ్ గాంధీతో పోల్చిన ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి
- నాటి రాష్ట్రపతి జైల్ సింగ్‌ను రాజీవ్ అవమానించారని ఆరోపణ

2లో



## మహా కూటమిలోకి మరో రెండు పార్టీలు

పాట్నా – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

బీహార్‌లో శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. తాజాగా ప్రతిపక్ష మహా కూటమిలోకి మరో 2 పార్టీలు వచ్చి చేరాయి. - మిగతా 2లో..

## సూపర్ సిక్స్-సూపర్ హిట్...

- ఈ నెల 10న అనంతపురంలో కూటమి పార్టీల భారీ సభ
- అనంతపురంలో ఎన్డీఏ కూటమి తొలి ఉమ్మడి బహిరంగ సభ
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- 15 నెలల పాలన విజయాలను ప్రజలకు వివరించేలా ఏర్పాట్లు
- అధికారంలోకి వచ్చాక మూడు పార్టీల మొదటి ఉమ్మడి సభ
- రాష్ట్రవ్యాప్తంగా తరలిరానున్న కూటమి శ్రేణులు





అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీఏ కూటమిలోని తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు తొలిసారిగా ఉమ్మడి బహిరంగ సభను నిర్వహించబోతున్నాయి. ఎన్నికల హామీ అయిన 'సూపర్ సిక్స్' పథకాల అమలు విజయవంతం కావడంతో, ఈ విజయాన్ని ప్రజలతో పంచుకునేందుకు భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ఈ సభకు అనంతపురం వేదిక కానుంది. ఈ నెల 10వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురంలోని ఇంద్రప్రస్థనగర్‌లో 'సూపర్ సిక్స్–సూపర్ హిట్' పేరుతో ఈ సభను నిర్వహించనున్నారు. 2024 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన 15 నెలల తర్వాత కూటమిలోని మూడు పార్టీలు కలిసి నిర్వహిస్తున్న తొలి ఉమ్మడి సభ ఇదే కావడంతో దీనికి రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, సత్యకుమార్ తో పాటు బీజేపీ రాష్ట్ర చీఫ్ పీవీఎన్ మాధవ్ హాజరుకానున్నారు.

గత 15 నెలల తమ పాలనలో సాధించిన విజయాలను, ముఖ్యంగా ఎన్నికల హామీల అమలు తీరును ప్రజలకు వివరించడమే ఈ సభ ముఖ్య ఉద్దేశం. 'సూపర్ సిక్స్' పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు లక్ష కోట్ల రూపాయలకు పైగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందాయని - మిగతా 2లో..



## వైజాగ్‌లో వరల్డ్ కప్ ఫీవర్..

- తొలి మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా మంత్రి లోకేశ్
- 2025 మహిళల క్రికెట్ ప్రపంచకప్‌కు వేదికగా విశాఖపట్నం
- ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఐదు మ్యాచ్‌ల నిర్వహణ
- ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి మేటి జట్ల రాక
- అక్టోబరు 9న భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి మ్యాచ్

అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7

ఆంధ్రప్రదేశ్‌లోని క్రికెట్ అభిమానులకు శుభవార్త. 2025లో జరిగే మహిళల క్రికెట్ ప్రపంచకప్‌కు విశాఖపట్నం కూడా ఓ ముఖ్య వేదికగా నిలవనుంది. ఈ మెగా టోర్నీలో భాగంగా నగరంలోని ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో మొత్తం ఐదు మ్యాచ్‌లు - మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# అరుణవర్ణంలో చంద్రబింబం..



(మొదటిపేజీ తరువాయి)

ఇదీ వీడనున్నది. అంటే 82 నిమిషాల పాటు పూర్తిగా భూమి నీడలోనే చంద్రుడు ఉండనున్నాడు. అయితే ఈ గ్రహణాన్ని బ్లడ్‌మూన్‌గా పిలుస్తున్నారు. అలాగే సోమవారం ఉదయం 2:25 గంటలకు చంద్రగ్రహణం వీడనున్నది. సూర్యుడు, భూమి, చంద్రుడు ఒకే సరళరేఖపై వచ్చినప్పుడు ఈ చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. కాగా ఈ చంద్రగ్రహణాన్ని చూసేందుకు పెద్దలు, చిన్నారులు ఆసక్తి కనబర్చారు. టెలీస్కోప్‌ల ద్వారా ఈ దృశ్యాన్ని వారు వీక్షించారు. కాగా నిపుణులు, హేతువాదులు ఈ చంద్రగ్రహణం గురించిన అసలు విషయాలను వివరిస్తూ అపోహలను తొలగించే ప్రయత్నాలు చేశారు. జెవివి ఆధ్వర్యంలో తిరుపతి, విజయవాడ వంటి నగరాల్లో గ్రహణ సమయంలోనే ఆహారం తీసుకుని యువత శాస్త్ర చైతన్యాన్ని చాటారు. ఆసియా, పశ్చిమ ఆస్ట్రేలియాల్లో సంపూర్ణ చంద్రగ్రహణం.. ఐరోపా, ఆఫ్రికా, తూర్పు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పాక్షిక చంద్రగ్రహణం కనిపించింది.

# ట్రంప్, జిన్‌పింగ్‌ల భేటీకి రంగం సిద్ధం?

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నారని అమెరికా అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా జిన్‌పింగ్‌తో ట్రంప్ సమావేశమయ్యే అవకాశాలున్నాయని సీఎన్ఎన్ కథనం పేర్కొంది. దక్షిణ కొరియాలోని గ్యాంగ్‌జూ నగరంలో అక్టోబర్ చివరి వారం నుంచి నవంబర్ మొదటి వారం మధ్య ఈ ఏపీఈసీ సదస్సు జరగనుంది. ఈ సదస్సు వేదికగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక సమావేశంపై తీవ్రస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అయితే ప్రణాళికలు ఇంకా ఖరారు కాలేదని శనివారం ట్రంప్ పరిపాలన వర్గాలు తెలిపాయి. గత నెలలో జిన్‌పింగ్ ఫోన్‌లో ట్రంప్‌ను చైనా పర్యటనకు ఆహ్వానించగా, ట్రంప్ కూడా సానుకూలంగా స్పందించారు. అయితే పర్యటన తేదీలు ఖరారు కాలేదు.

**కిమ్‌తో భేటీకి కూడా సై**

ఈ పర్యటనలో ట్రంప్ కేవలం జిన్‌పింగ్‌తోనే కాకుండా, ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో కూడా సమావేశమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతవారం ట్రంప్‌తో సమావేశమైన దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్, ఏపీఈసీ సదస్సుకు హాజరు కావాలని ఆహ్వానించారు. కిమ్‌తో సమావేశానికి ఇది మంచి అవకాశమని కూడా ఆయన సూచించినట్లు సమాచారం. దీనిపై స్పందించిన ట్రంప్, కిమ్‌తో భేటీకి తాను సిద్ధంగా ఉన్నానని శనివారం విలేకరులతో అన్నారు. "ఆయన నన్ను కలవాలనుకుంటున్నారు. మేం కలుస్తాం, సంబంధాలు మెరుగుపరుస్తాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**విమర్శల నడుమ భేటీకి యత్నం**

ఇటీవల చైనా, రష్యా, భారత అధినేతలు బీజింగ్‌లో సమావేశమవడంపై ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించిన నేపథ్యంలో ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా సైనిక పరేడ్ సందర్భంగా జిన్‌పింగ్, పుతిన్, మోదీ భేటీ కావడంపై ట్రంప్ సోషల్ మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్న మీకు నా శుభాకాంక్షలు" అని పోస్ట్ చేశారు. మరో పోస్టులో "మనం భారత్, రష్యాలను చీకటి చైనాకు కోల్పోయినట్లున్నాం" అని వ్యాఖ్యానించారు.

**వాణిజ్య యుద్ధంపై చర్చలు?**

మరోవైపు అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగుతోంది. చైనా దిగుమతులపై ట్రంప్ 145 శాతం సుంకాలు విధించగా, ప్రతిగా అమెరికా వస్తువులపై చైనా 125 శాతం సుంకాలు విధించింది. చర్చల నేపథ్యంలో నవంబర్ వరకు ఈ సుంకాలను ట్రంప్ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో ఇరువురు నేతల భేటీ జరిగితే వాణిజ్య వివాదాలపై కీలక చర్చలు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్థిక పెట్టుబడులను ఆకర్షించడం, వాణిజ్యం, రక్షణ, పౌర అణు సహకారం వంటి అంశాలపై కూడా ఈ పర్యటనలో దృష్టి సారించనున్నట్లు వైట్‌హౌస్ అధికారి ఒకరు తెలిపారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

(మొదటిపేజీ తరువాయి)

తొలుత ఎమ్మెల్యేలు వారం రోజుల గడువు కోరారు. ఆ గడువు ముగియడంతో తదుపరి కార్యాచరణను నిర్ణయించుకునేందుకు వారంతా ముఖ్యమంత్రిని కలిశారు. అయితే, ఈ సమావేశానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి మినహా మిగిలిన తొమ్మిది మంది హాజరయ్యారు.

ఇటీవల పార్టీ ఫిరాయింపులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఈ పరిణామాలకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులను న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలి, ఎలాంటి వివరణ ఇవ్వాలనే అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు ఉన్న మార్గాలపై వారు లోతుగా మంతనాలు జరిపారు. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఫిరాయింపుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. తమ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఈ భేటీ స్పష్టం చేస్తోంది. తదుపరి ఏం జరగనుందనే విషయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# సూపర్ సిక్స్-సూపర్ హిట్...

(మొదటిపేజీ తరువాయి)

కూటమి నేతలు చెబుతున్నారు. ఈ వివరాలతో పాటు, రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం, సుపరిపాలన అందించడం వంటి అంశాలను ప్రజల ముందు ఉంచనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యేలా కూటమి నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. 2024 ఎన్నికల్లో 164 స్థానాలతో చారిత్రాత్మక విజయం సాధించిన ఎన్డీఏ కూటమి, తమ ఐక్యతను, పాలన పటిమను చాటిచెప్పేందుకు ఈ సభను ఒక అవకాశంగా భావిస్తోంది.

# రాష్ట్రపతికి ప్రధాని బ్రీఫింగ్

- మోదీ పాటిస్తున్న సంప్రదాయం..
- రాజీవ్ గాంధీ విస్మరించిన వైనం!
- విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని మోదీ భేటీ
- ప్రతి పర్యటన తర్వాత రాష్ట్రపతికి వివరించడం మోదీకి అలవాటు
- మోదీ తీరును రాజీవ్ గాంధీతో పోల్చిన ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త గురుమూర్తి
- నాటి రాష్ట్రపతి జైల్ సింగ్‌ను రాజీవ్ అవమానించారని ఆరోపణ

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7**

దేశ ప్రధాని ఒక ముఖ్యమైన విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత, ఆ వివరాలను రాష్ట్రపతికి తెలియజేయడం అనేది ఒక గౌరవప్రదమైన సంప్రదాయం. అయితే, ఈ చిన్న ప్రోటోకాల్‌ను పాటించడం, విస్మరించడం మధ్య దేశ రాజకీయాలపై ఎంతటి ప్రభావం ఉంటుందో చరిత్ర స్పష్టంగా చూపిస్తోంది. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ఈ సంప్రదాయాన్ని నిబద్ధతతో పాటిస్తుండగా, ఇదే విషయాన్ని విస్మరించి నాటి ప్రధాని రాజీవ్ గాంధీ తీవ్ర రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారని ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త, తుగ్లక్ పత్రిక సంపాదకులు ఎస్. గురుమూర్తి గుర్తుచేశారు. శనివారం చైనా, జపాన్ పర్యటనల నుంచి తిరిగి వచ్చిన వెంటనే ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ద్రౌపదీ ముర్ముతో సమావేశమయ్యారు. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు వివరాలను, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో జరిపిన ద్వైపాక్షిక చర్చల సారాంశాన్ని ఆయన రాష్ట్రపతికి వివరించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ప్రతి విదేశీ పర్యటన అనంతరం రాష్ట్రపతికి ఇలా బ్రీఫింగ్ ఇవ్వడాన్ని మోదీ ఒక నియమంగా పాటిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఎస్. గురుమూర్తి 'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్ట్ తీవ్ర చర్చనీయాంశమైంది. "ప్రధాని మోదీ విదేశీ పర్యటనల తర్వాత రాష్ట్రపతికి బ్రీఫింగ్ ఇచ్చే ఈ ప్రోటోకాల్‌ను చూసినప్పుడల్లా, నాటి ప్రధాని రాజీవ్ గాంధీ తనను ఎలా అవమానించారో అప్పటి రాష్ట్రపతి జైల్ సింగ్ నా వద్ద కన్నీళ్లు పెట్టుకున్న రోజులు గుర్తొస్తాయి. అహంకారంతో వ్యవహరించిన రాజీవ్ తన పతనాన్ని తానే కొనితెచ్చుకున్నారు" అని గురుమూర్తి పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ తీరుతో తీవ్రంగా నొచ్చుకున్న జైల్ సింగ్, ప్రధానికి తన ఆవేదనను తెలియజేస్తూ ఒక లేఖ రాయడానికి తన సహాయం కోరారని గురుమూర్తి గుర్తుచేసుకున్నారు. తాను రాసిన ఆ లేఖను 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సంపాదకీయ సలహాదారు ముల్గావ్‌కర్ మెరుగు పరిచారని, అది 1987 మార్చి 31న ప్రచురితమైందని తెలిపారు. "ఆ లేఖ రాజీవ్ ప్రభుత్వంపై పేలిన మొదటి బాంబు. ఆ తర్వాత వారం రోజులకే ఫెయిర్‌ఫ్యాక్స్, ఆ వెంటనే హెచ్‌డీడబ్ల్యూ లంచాల కుంభకోణం, ఆపై వీపీ సింగ్ రాజీనామా, కొద్ది రోజులకే బోఫోర్స్ బాగోతం బయటపడ్డాయి. కేవలం 40 రోజుల్లో జరిగిన ఈ పరిణామాల నుంచి రాజీవ్ గాంధీ మళ్లీ కోలుకోలేకపోయారు" అని గురుమూర్తి వివరించారు.

రాజీవ్ గాంధీ హయాంలో దేశంలోని రెండు అత్యున్నత రాజ్యాంగ పదవుల మధ్య ఏర్పడిన అగాధం తీవ్ర సంక్షోభానికి దారితీసింది. దీనికి భిన్నంగా, ప్రధాని మోదీ తన హయాంలో రాష్ట్రపతులుగా ఉన్న రామ్‌నాథ్ కోవింద్ నుంచి నేటి ద్రౌపదీ ముర్ము వరకు అందరితోనూ రాజ్యాంగబద్ధమైన గౌరవాన్ని, సామరస్యాన్ని కొనసాగిస్తున్నారు. ఇది కేవలం మర్యాదపూర్వక చర్యే కాదని, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని నిలబెట్టే ఒక ముఖ్యమైన సంకేతమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అధికారం అనేది అహంకారంతో కాకుండా, వినయం, నిబద్ధతతో ముడిపడి ఉంటుందనడానికి ఇది నిదర్శనమని వారు పేర్కొంటున్నారు.

# కొనసాగుతోన్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె

- 20వ రోజుకు చేరినా స్పందించని ఛత్తీస్‌గఢ్ సర్కారు
- అత్యవసర వైద్య సేవలకు తీవ్ర ఆటంకం

**ఛత్తీస్‌గఢ్– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7**

ఛత్తీస్‌గఢ్‌లో డిమాండ్ల సాధన కోసం జరుగుతున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల సమ్మె ఆదివారం నాటికి 20వ రోజుకు చేరుకున్నది. ఇప్పటికే ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న 14వేల మంది కాంట్రాక్టు సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామాలు చేసిన విషయం కూడా విదితమే. అయినప్పటికీ అక్కడి



బిజెపి సర్కారులో మాత్రం ఎలాంటి చలనమూ కనబడటం లేదు. దీంతో రాష్ట్రంలో అత్యవసర వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలుగు తున్నది. విద్యా సంస్థలలో వైద్య పరీక్షలు జరగటం లేవు. ఫలితంగా రోగులు, రోగుల బంధువులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోని బిజెపి**

25 మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను ప్రభుత్వం ఉద్యోగాల నుంచి తొలగిస్తూ అక్కడి బిజెపి సర్కారు ఉత్తర్వులివ్వటం, ప్రభుత్వ చర్యను తప్పుపడుతూ ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న 14 వేల మంది కాంట్రాక్ట్ సిబ్బంది మూకుమ్మడిగా రాజీనామాలు సమర్పించటం దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం విదితమే. న్యాయబద్ధమైన తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఉద్యోగులు ప్రారంభించిన సమ్మె ఆదివారం 20వ రోజుకు చేరింది.

# ఏపీలో పెట్టుబడులు పెట్టండి



(మొదటిపేజీ తరువాయి)

విధానాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. "పరిశ్రమదారులు డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టుతో రాష్ట్రానికి వచ్చాక నిర్మాణం పూర్తయ్యే వరకు పూర్తి బాధ్యత మాదే. రాష్ట్రంలో పెద్దఎత్తున వాయు, జల, రోడ్డు రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు గారి నేతృత్వంలో ఆంధ్రపదేశ్ లాజిస్టిక్ హబ్‌గా అభివృద్ధి చెందుతోంది. రాష్ట్రంలో అమలు చేస్తున్న పరిశ్రమ అనుకూల విధానాల వల్ల జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. పరిశ్రమలకు గమ్యస్థానంగా మారిన ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టండి" అంటూ మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

# మహా కూటమిలోకి మరో రెండు పార్టీలు

(మొదటిపేజీ తరువాయి)

హేమంత్ సోరేన్ నేతృత్వంలోని జార?ండ్ ముక్తి మోర్చా (జెఎంఎం), పసుపతి పరాస్ నేతృత్వంలో ఎల్‌జెపి మహాకూటమిలోకి వచ్చాయి. ప్రస్తుతం మహా కూటమిలో ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ సహా 6 పార్టీలు ఉన్నాయి. తాజాగా చేరిన రెండు పార్టీలతో కలిసి మొత్తం 8 పార్టీలు మొత్తం 243 సీట్లను సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. పసుపతి పరాస్ (ఎల్‌జెపి) రాకతో పాసవాన్ చెందిన ఓట్లను రాబట్టుకోవడానికి మహాకూటమి అనుకూలంగా ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. దీంతో ఖగారియా ప్రాంతంలో పరాస్ వర్గానికి రెండు లేదా మూడు సీట్లు కేటాయించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే, జార?ండ్‌లోని ప్రభుత్వంలో కాంగ్రెస్, ఆర్‌జెడి భాగస్వాములుగా ఉన్నందున బిహార్‌లో జెఎంఎంకు కనీసం ఒక్క సీటైనా కేటాయించాల్సిన అవసరం ఉంది. బంకా, ముంగర్, భాగల్‌పూర్ స్థానాల్లో ఏదో ఒక సీటును జేఎంఎంకు కేటాయించే అవకాశం ఉంది.

# వైజాగ్‌లో వరల్డ్ కప్ ఫీవర్..

(మొదటిపేజీ తరువాయి)

జరగనున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీకి ఆతిథ్యం ఇచ్చే అవకాశం దక్కడంపై ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏసీఏ ప్రధాన కార్యదర్శి సానా సతీశ్, ఇతర సభ్యులతో కలిసి ప్రపంచకప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ టోర్నీలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా వంటి బలమైన మహిళా జట్లు విశాఖలో తలపడనున్నాయని ఆయన తెలిపారు. విశాఖలో అక్టోబరు 9న జరగనున్న తొలి మ్యాచ్‌కు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని సానా సతీశ్ వెల్లడించారు. "రాష్ట్రంలో మహిళా క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మంత్రి లోకేశ్ ఈ కార్యక్రమానికి వస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లోనూ మహిళలను ప్రోత్సహించేందుకు ఏసీఏ కృషి చేస్తుందని సతీశ్ హామీ ఇచ్చారు. కాగా, విశాఖలో జరగనున్న తొలి ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు, దక్షిణాఫ్రికాతో తలపడనుంది. ఈ అంతర్జాతీయ టోర్నీ ఆతిథ్యం రాష్ట్రంలో మహిళా క్రికెట్ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని క్రీడా వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

# ముంబయిలో భారీ అగ్ని ప్రమాదం

## - ఒకరి మృతి, 19 మందికి గాయాలు

**ముంబయి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7**



దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా, మరో 19 మంది గాయపడ్డారు. దహిసర్ ప్రాంతంలోని ఒక బిల్డింగ్‌లో ఆదివారం మధ్యాహ్నం ఈ విషాద సంఘటన చోటుచేసుకుంది. విషయం తెలిసిన వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 36 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దహిసర్ తూర్పు ప్రాంతంలోని ఒక భవంతిలో ఏడో అంతస్థులో మధ్యాహ్నం 4:30 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఏడు ఫైరింజన్లతో అక్కడికి చేరుకున్నారు. దాదాపు గంటన్నరకు పైగా శ్రమించి మంటల్ని ఆర్పేశారు. ఈ ప్రమాదం నుంచి 36 మందిని నిచ్చెన సాయంతో కాపాడారు. వీళ్లలో గాయపడిన 19 మందిని సమీపంలోని నార్తర్న్ కేర్ హాస్పిట్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వాళ్లలో నాలుగేళ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.ఏడో అంతస్థులోని విద్యుత్ వైర్లు దెబ్బతినడం.. లేదా సరిగా పనిచేయకపోవడం వల్ల ప్రారంభమైన మంటలు క్రమంగా మంటలు ఎలక్రిక్ వలయం నుంచి పై అంతస్థులకు వ్యాపించాయని ప్రాథమిక దర్యాప్తులో పోలీసులు తెలిపారు.

# సంపాదకీయం

## ఎట్లుండె... ఎట్లాయ్యె...




శీర్షిక చదవగానే ఎక్కడో విన్నట్లు ఉంది కదా.. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ స్లోగన్ 'ఎట్లుండె తెలంగాణ.. ఎట్లమారె తెలంగాణ'ను కాస్త మార్చాం. ఎందుకంటే ఇప్పుడు ఆ స్లోగన్ బీఆర్ఎస్‌కు సరిగ్గా సరిపోతుంది. పవర్ పాలిటిక్స్, ఆధిపత్యపోరు అంతర్గత కలహాలతో పార్టీ సతమతమవుతోంది. తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా ఉన్న పార్టీ, ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంతో బలంగా ఉద్భవించి, దాదాపు ఒక దశాబ్దంపాటు అధికారంలో కొనసాగిన ఈ పార్టీ, ఇప్పుడు ఓటమి, నాయకుల బయటకు వెళ్లడం, కీలక నాయకుల దూరం వంటి సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. వీటికితోడు తాజాగా అంతర్గత కొట్లాటలు క్యాడర్‌లో అనేక అనుమానాలు, ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్ 2001లో కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్)నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కోసం ఏర్పడింది. తెలంగాణ ఆకాంక్షలకు ప్రతీకగా నిలిచిన ఈ పార్టీ, 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ వ్యూహాత్మక నాయకత్వం, హరీశ్‌రావు, కేటీఆర్, కవిత వంటి కుటుంబ సభ్యుల బలమైన మద్దతు, రాష్ట్ర ప్రజల ఆదరణతో బీఆర్ఎస్‌ను రాజకీయంగా బలమైన శక్తిగా మార్చాయి. 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలతో పార్టీ తన ఆధిపత్యాన్ని స్థిరపరిచింది. అయితే, ఈ విజయాల వెనుక కొన్ని సమస్యలు మొదలయ్యాయి. అధికారంలో ఉండగా, బీఆర్ఎస్‌పై వ్యతిరేకత పెరగడం, ఆరోపణలు, కొన్ని విధానాలపై విమర్శలు బలపడ్డాయి. ప్రజల అసంతృప్తి, ప్రతిపక్షాల బలోపేతం క్రమంగా బీఆర్ఎస్ బలాన్ని సన్నగిల్లేలా చేశాయి. 2022లో కేసీఆర్ జాతీయ రాజకీయ ఆకాంక్షలతో టీఆర్ఎస్ పేరును భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్ )గా మార్చారు. ఈ నిర్ణయం పార్టీ దృష్టిని తెలంగాణ రాజకీయాల నుంచి జాతీయ స్థాయికి మళ్లించినప్పటికీ, ఇది తెలంగాణలోని స్థానిక సమస్యల నుంచి దృష్టిని మరల్చిందనే విమర్శలు వచ్చాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఊహించని ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గులాబీ పార్టీ రాజకీయ ఆధిపత్యం క్షీణించింది. 2023 ఎన్నికల ఓటమి తర్వాత, బీఆర్ఎస్‌లో అస్థిరత మరింత పెరిగింది. పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్, బీజేపీలో చేరారు. ఇది పార్టీ బలాన్ని మరింత దెబ్బతీసింది. అంతేకాక, కేసీఆర్ కూతురు కవిత ఆధితప్యం కోసం పార్టీ విధానాలను తప్పు పట్టడం అగ్గి రాజేసింది. చివరకు హరీశ్‌రావు, సంతోష్‌రావు టార్గెట్‌గా చేసిన ఆరోపణలు పార్టీ నుంచి సస్పెండ్ చేసే వరకు వెళ్లాయి. కవిత, ఒకప్పుడు పార్టీలో ముఖ్యమైన నాయకురాలిగా ఉండేది. ఇప్పుడు ఆమె దూరం కావడం, ఒకవైపు కుటుంబంలోని అంతర్గత సమస్యలను సూచిస్తుండగా, మరోవైపు పార్టీలో నాయకత్వ సంక్షోభాన్ని స్పష్టం చేస్తోంది. ఈ పరిణామాలు ఆఖ యొక్క భవిష్యత్తుపై ఆందోళనలను పెంచాయి. దీంతో క్యాడర్‌లో కూడా కలవరం మొదలయ్యాయి. అధిష్టానంపై అనేక అనుమానాలు, ప్రశ్నలను రేకెత్తిస్తున్నాయి.

## కవిత ఒంటరి


హైదరాబాద్ – సూర్య వాస్తవం



భారత రాష్ట్ర సమితి చరిత్రలో మహిళా నాయకులు ఎప్పుడు కూడా ఇంత ఐక్యంగా లేరు. నా మీద సస్పెన్షన్ తర్వాత మహిళా నేతలు అందరూ కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సంతోషం. ఇదే నేను కోరుకుంటున్నది. అధ్యక్షుడికి.. కింది స్థాయి కార్యకర్తకు యాక్సిస్ ఉండాలని భావిస్తున్నాను. ఇప్పటికైనా మహిళా నేతలను గుర్తించారు" ఇవీ బుధవారం నాటి విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలు.. నిన్నటి విలేకరుల సమావేశంలో ఒంటరిగానే కవిత మాట్లాడారు. యాదృచ్ఛికంగా ఆమెను ఒంటరి చేసే ప్రయత్నాలను గులాబీ పార్టీ విజయవంతంగా చేపడుతోంది.గురువారం హైదరాబాదులోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో గతంలో జాగృతిలో పనిచేసిన వారంతా కవితకు వ్యతిరేకంగా మాట్లాడారు. మేడే రాజీవ్ సాగర్, రాజారామ్ యాదవ్, ప్రశాంత్ వంటి వారు తీవ్ర స్వరంతో కవితను విమర్శించారు. వీరంతా కూడా తెలంగాణ జాగృతిలో కీలకంగా పనిచేశారు. గడచిన 18 సంవత్సరాలుగా వీరంతా కూడా కవిత వెన్నంటే ఉన్నారు. ఎప్పుడైతే కవిత భారత రాష్ట్ర సమితిలో ఉన్న కీలక నాయకుల మీద ఆరోపణలు చేయడం.. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఒక్కసారిగా వీరంతా విలేకరుల సమావేశం ద్వారా అసలు విషయాలను బయటపెట్టారు.. తామంతా గులాబీ పార్టీలోనే ఉంటామని.. కెసిఆర్ తోనే కొనసాగుతామని.. కారు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. దీనికి తోడు కవిత చేసిన వ్యాఖ్యలను ప్రముఖంగా ప్రస్తావించారు."ఇన్ని రోజులపాటు మేము మీతో పాటు ప్రయాణం చేశాం. ఎన్నడైనా మీరు మా గురించి అడిగారా.. మా గురించి పట్టించుకున్నారా.. మేము ఏం తిన్నాం.. ఎలా ఉన్నాం.. అని అడిగారా లేదు కదా.. అలాంటప్పుడు మిమ్మల్ని కల్వకుంట్ల తారకరామారావు ఎందుకు అడగాలి.. మీ గురించి ఎందుకు పట్టించుకోవాలని" జాగృతి నేతలు ప్రశ్నించారు.కవిత చేసిన వ్యాఖ్యలతో ఒక రకంగా భారత రాష్ట్ర సమితి రాజకీయంగా ఇబ్బందికరమైన వాతావరణాన్ని ఎదుర్కొంటున్నది. సోషల్ మీడియాలో కాంగ్రెస్, బిజెపి నాయకులు గులాబీ పార్టీని తీవ్రంగా విమర్శిస్తున్నారు. కవితకు సంఘీభావంగా మాట్లాడుతున్నారు. దీంతో గులాబీ పార్టీ పెద్దలు రంగంలోకి దిగి కవితకు అండగా ఉన్న వారందరినీ కూడా బయటకు పిలిపించి మాట్లాడించారు. ఆమెకు వ్యతిరేక స్వరం వినిపించేలా చేశారు. మొత్తంగా ఆమెను ఒంటరి చేసే ప్రయత్నాన్ని విజయవంతంగా అమలు చేశారు. ఇటీవల జాగృతికి సంబంధించి నూతన కార్యవర్గాన్ని కవిత ఎంపిక చేసిన క్రమంలో.. వీరందరికీ కూడా స్థానం లభించలేదు. బహుశా అందువల్లే కవిత మీద విమర్శలు చేస్తున్నారని జాగృతి నాయకులు అంటున్నారు.. కీలక నాయకులు కవితకు వ్యతిరేకంగా స్వరం వినిపించిన నేపథ్యంలో.. జాగృతి అధినాయకురాలు ఎలాంటి అడుగులు వేస్తారు.. గులాబీ పార్టీ పెద్దల కుట్రలను ఎలా తిప్పి కొడతారు.. అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది.

# కొత్త పాలసీలు అక్కరకు వచ్చేనా

విజయవాడ – సూర్య వాస్తవం




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడుల కోసం అనేక ప్రయత్నాలు చేస్తుంది. ఉపాధి అవకాశాలు పెంచడమే కాకుండా, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపాలన్న ఉద్దేశ్యంతో పరిశ్రమలకు బంపర్ ఆఫర్ ఇస్తుంది. పారిశ్రామికాభివృద్ధి కోసం వినూత్న నిర్ణయాలను తీసుకుంటుంది. ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీలను రాష్ట్రానికి తీసుకు వచ్చేందుకు భూములకు తక్కువ ధరకు ఇచ్చేందుకు కూడా సిద్ధపడింది. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తే తలసరి ఆదాయం పెరిగే అవకాశముందని అంచనా వేసి సరికొత్త విధానాన్ని ప్రకటించింది. ఈ విధానం కింద ఎకరా భూమిని కేవలం 99 పైసల నామమాత్రపు లీజు ధరకు కేటాయించనున్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. .. ప్రభుత్వం తెచ్చిన 'టెక్‌హబ్ పాలసీ 4.0' ప్రకారం, విశాఖపట్నం, అమరావతి, తిరుపతి నగరాల్లో భూములు కేటాయించనున్నారు. ఫార్చ్యూన్-500, ఫోర్బ్స్ గ్లోబల్ జాబితాలో ఉన్న పెద్ద ఐటీ సంస్థలు మాత్రమే ఈ పథకానికి అర్హులుగా పేర్కొనడంతో బడా కంపెనీలను ఆకట్టుకునే ప్రయత్నమని చెప్పక తప్పదు. కంపెనీలు మూడేళ్లలో కనీసం మూడు ఉద్యోగాలు సృష్టించాలన్నది ప్రభుత్వం విధించిన ప్రధాన షరతు. బెంగళూరు, హైదరాబాద్ వంటి ఐటీ నగరాలతో పోటీపడి, రాష్ట్రాన్ని ఒక ప్రధాన టెక్ హబ్‌గా మార్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలకు భూములు కేటాయించారు. మరికొన్ని ప్రముఖ కంపెనీలు కూడా క్యూ కట్టే అవకాశముందన్న అంచనాలు వినపడుతున్నాయి. కేబినెట్ ఆమోదం పారిశ్రామికవేత్తలను ఆకర్షించడమే కాకుండా... ఈ పథకం చూడటానికి పారిశ్రామికవేత్తలకు ఆకర్షణ కోసమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ శాతం తగ్గించేందుకు ఉపయోగపడుతుందని భావించి కొత్త పాలసీని ప్రకటించారు. భూములు కారు చౌకగా ఇస్తున్నందున భూముల కోసమని కాకుండా, తమ కంపెనీ విస్తరణ కోసమయినా రాష్ట్రానికి వస్తారని కూటమి ప్రభుత్వం ఆశగా ఉంది. 2014లో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత వెనకబడిన ప్రాంతమైన అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమను తేవడంతో ఆయన పేరు రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. మొన్నటి ఎన్నికల సమయంలో అది కూడా ఆయన గెలుపునకు తోడ్పడింది. ఇప్పుడు అదే విధంగా తక్కువ ధరకు భూములిచ్చైనా భారీ పరిశ్రమలను తెచ్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. చంద్రబాబు సర్కార్ చేస్తున్న ఈ ప్రయత్నం ఫలిస్తే మరొకసారి విజయానికి దగ్గరగా వెళతామన్న నమ్మకంతో పార్టీ నేతలున్నారు.

# గ్రేటర్‌లో 11 లక్షల మందికి చీరలు

హైదరాబాద్ – సూర్య వాస్తవం





గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ దసరా, బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కనీవినీ ఎరుగని రీతిలో ఈ సంవత్సరం బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది. మూడు రోజులు పాటు కార్నివాల్ తరహాలో బతుకమ్మ వేడుకలు నిర్వహించేందుకు ప్రభుత్వం రెడీ అయ్యింది. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా నగరంలోని 11 లక్షల మందికి బతుకమ్మ కానుక ఇవ్వనుంది..గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది.

ఒక్కరు, ఇద్దరు కాదు ఏకంగా 11 లక్షల మందికి దసరా పండుగ కానుక ఇచ్చేందుకు రెడీ అవుతోంది. ఆడపడుచులకు దసరా పండుగ కానుకతో పాటుగా.. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ స?ష్టించేలా కార్యక్రమాలు రూపొందిస్తుంది. ఇంతకు జీహెచ్ఎంసీ ఏం చేయబోతుంది అంటే.. ఈ సంవత్సరం నిర్వహించ బోయే బతుకమ్మ ఉత్సవాలను గిన్నిస్ బుక్ రికార్డుల్లోకి ఎక్కించడమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేస్తోందిఈ సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించేందుకు జీహెచ్ఎంసీ రెడీ అవుతోంది. దీనిలో భాగంగా ఏకంగా 11 లక్షల మందితో బతుకమ్మ సంబురాలు నిర్వహించ బోతుంది. అలానే వీరందరికి బతుకమ్మ చీరలను కూడా పంపిణీ చేయనున్నారు. ఈక్రమంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 11 లక్షల మంది స్వయం సహాయక సభ్యులకు పంపిణీ చేయడం కోసం సర్కార్ 11 లక్షల బతుకమ్మ చీరలను కేటాయించనుంది. బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కోసం సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించ బోతున్నారని తెలుస్తోంది. ఇప్పటి వరకు కేరళలో నిర్వహించే ఓనం పండుగ మాత్రమే ఇలాంటి రికార్డు క్రియేట్ చేయగా.. ఈసారి బతుకమ్మ ఉత్సవాలతో ఆ రికార్డును బ్రేక్ చేసేందుకు జీహెచ్ఎంసీ రెడీ అయినట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నుంచి బతుకమ్మ ఉత్సవాలు, నవరాత్రులు మొదలవుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో సెప్టెంబర్ 27న సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ కార్నివాల్ ఉత్సవాలు నిర్వహించ బోతున్నారు. ఆ మరుసటి రోజు అనగా సెప్టెంబర్ 28న ఎల్బీ స్టేడియంలో బతుకమ్మ గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమం నిర్వహిస్తారు. 11 లక్షల మంది ఈ వేడుకలో పాల్గొంటారు. ఆ తర్వాత సెప్టెంబర్ 29న పీపుల్స్ ప్లాజా వద్ద ఉత్తమ బతుకమ్మ పోటీలు నిర్వహించబోతున్నారు. అలానే సెప్టెంబర్ 30వ తేదీన ట్యాంక్‌బండ్ వద్ద అంగరంగ వైభవంగా పూల పండుగ నిర్వహించనున్నారు. బతుకమ్మ వేడుకల నేపథ్యంలో నగరంలోని సుమారు 30 సర్కిళ్ల నుంచి మహిళలను శిల్పకళా వేదిక వద్దకు తరలిం చేందుకు గాను.. 150 బస్సులను వినియోగించ బోతున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. ఈ బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా అప్పర్ ట్యాంక్ బండ్ పై స్పెషల్ పరేడ్ కార్యక్రమాన్ని నిర్వహించను న్నారు. అలానే రాష్ట్రంలోని పలు చేతివృత్తుల వారు తయారు చేసిన కళాఖండాలు, ఇతర ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించడమే కాక విక్రయించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు నెక్లెస్ రోడ్డులో మూడు రోజుల పాటు.. తెలంగాణ వంటకాలతో స్పెషల్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు అధికారులు ప్లాన్ చేస్తున్నారు.

# వైసీపీ ఎమ్మెల్యేల్లో చీలిక...

ఒంగోలు – సూర్య వాస్తవం




వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. ఆ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి శాసనసభకు హాజరు కావడం లేదు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు హాజరవుతానని చెబుతున్నారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చే ధైర్యం లేదని చంద్రబాబుకి సవాల్ చేస్తున్నారు. అసలు బుద్ధి జ్ఞానం ఉందా అంటూ చంద్రబాబు ప్రశ్నించిన జగన్ తీరులో మార్పు రావడం లేదు. ఆయుధం ఇవ్వండి యుద్ధం చేస్తా అన్నట్టు ఉంది జగన్మోహన్ రెడ్డి. అంతకు మించింది ఏంటంటే.. అధికార పార్టీపై పోరాటం చేసేందుకు.. అదే అధికార పార్టీకి అనుమతి కోరినట్టు ఉంది. అయితే ప్రస్తుతం జగన్ వైఖరి ఇంటా బయట చర్చ జరుగుతోంది. శాసనమండలి సమావేశాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. మరి శాసనసభకు ఏం బాధ వచ్చింది అనేవారు ఉన్నారు. పోనీ హోదా ఇస్తే.. గంటలకు గంటలు మాట్లాడే అవకాశం ఇచ్చినా జగన్ మాట్లాడగలరా? ప్రమాణ స్వీకార సమయంలోనే ఆయన పూర్తిగా అయోమయానికి గురయ్యారు. చాలా ఆత్మ నున్యతా భావంతో మాట్లాడారు. అటువంటి వ్యక్తి వచ్చి 164 మంది ఎమ్మెల్యేలను ఎదుర్కోవడం సాధ్యమా? అది అయ్యే పనేనా? అందుకే జగన్తో పని లేకుండా ఓ ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవుతారని ప్రచారం నడుస్తోందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఈసారి పేరు మోసిన నేతలు ఎవరూ గెలవలేదు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తమ్ముడు ద్వారకానాథ్ రెడ్డి, కడప జిల్లా నుంచి అమర్నాథ్ రెడ్డి, మరో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి లాంటి వారే గెలిచారు. మిగతా వారంతా పెద్దగా తెలియని వారే. అయితే ఇప్పుడు జగన్ అభిప్రాయంతో సంబంధం లేకుండా.. ఓ ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరవుతారని ప్రచారం నడుస్తోంది. అయితే అనర్హత వేటు భయం తోనే వారు సభకు హాజరవుతున్నట్లు సమాచారం. సభకు సమాచారం ఇవ్వకుండా 60 పని దినాలు హాజరు కాకపోతే అనరాహత వేటు వేయవచ్చు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత వైసిపి సభ్యులు హాజరు కాలేదు. ఒకే ఒక్క రోజు గవర్నర్ ప్రసంగం నాడు సభకు హాజరయ్యారు. ఆరోజు హాజరు వేసుకున్నారు. కానీ అది చెల్లదని తేలింది. తరువాత కొందరు దొంగ చాటుగా వచ్చి సంతకాలు పెట్టినట్లు తెలియడంతో స్పీకర్ రూలింగ్ ఇచ్చారు. సెప్టెంబర్ నెలలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలునిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ సమావేశాలకు హాజరు కాకుంటే మాత్రం.. 60 రోజుల కోటా పూర్తి అయిపోతుంది. అందుకే వైసీపీ ఎమ్మెల్యేలు ఒకరితో ఒకరు మాట్లాడుకుని అసెంబ్లీకి హాజరు కావాలని నిర్ణయించుకు న్నట్లుగా చెబుతున్నారు. అలా సభకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పాలని భావిస్తున్నారు. అయితే ఆ ఆరుగురు ఎవరు అన్నది మాత్రం తెలియడం లేదు. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో మాత్రం సభకు హాజరవు తారని బలంగా ప్రచారం జరుగు తోంది. అయితే వారిని కచ్చితంగా ఆపేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రయత్నిస్తారు. ఆ ఆరుగురు సభ్యులు సభకు హాజరైతే మాత్రం జగన్మోహన్ రెడ్డి బరువు పోవడం ఖాయం. అయితే ఇందులో తొలిసారిగా ఎమ్మెల్యేలు అయిన వారు ఉన్నారు. కనీసం సభలో మాట్లాడకుండా తమ పదవీకాలం ముగిస్తే.. తమకు ఏం ప్రయోజనమని.. కనీసం మాజీ ఎమ్మెల్యేల కోటా కింద పెన్షన్ తో పాటు రాయితీలు తీసుకోలేమని బాధపడుతున్న వారు ఉన్నారు. అందుకే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## ఇంట్లోకి దూసుకెళ్ళిన కారు

### -రూ. 2లక్షల ఆస్తినష్టం




**కురబలకోట-సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :**హార్సిలీ హిల్స్ వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్ళి త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఆదివారం కురబలకోట మండలంలో జరిగిన ఘటనపై బాదితులు తెలిపిన వివరాలు.. పలమనేరుకి చెందిన కొందరు యువకులు కారులో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బి కొత్తకోట మండలం, హార్సిలీ హిల్స్ కు బయలు దేరారు. కారు మార్గ మధ్యంలోని కంటేవారిపల్లె వద్దకు రాగానే గ్రామానికి చెందిన మనోహర్ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో, ఇంటి ముందు ఏర్పాటు చేసిన రేకుల షెడ్డు, ఒక బైక్, సుమారు రెండు లక్షలకు పైగా విలువచేసే మట్టి కుండలు ధ్వంసం అయ్యాయని తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కారు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలు



**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :**రోడ్డు పక్కన నిలబడిన వృద్ధున్ని కారు ఢీకొని తీవ్రంగా గాయ పడ్డాడు. ఆదివారం మదనపల్లె లో జరిగిన ఘటనపై ఒకటవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక అమ్మ చెరువు మిట్ట ఏసి గోడౌన్ సమీపంలో కాపురం ఉండే లియాకత్ అలీ (63), సొంత పనిపై పట్టణంలోని నీరు గట్టు వారి పల్లె రింగ్ రోడ్డు వద్దకు వచ్చాడు. అక్కడ రోడ్డు పక్కన నిలబడి ఉండగా, ఓ కారు వేగంగా వచ్చి వృద్ధున్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితున్ని స్థానికులు వెంటనే, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓట్ చోర్.. ఘద్దీ చోడ్

### - పోస్టుకార్డు ఉద్యమంలో రెడ్డి సాహెబ్




**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :**బిజెపి దొంగోఓట్ల రాజకీయానికి నిరసన తెలియజేస్తూ ఓట్ చోర్.. ఘద్దీ చోడ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మదనపల్లె సీనియర్ కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్ తెలిపారు. మదనపల్లె పట్టణంలో ఎన్ఎస్ యూఐ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సి.సాయిసంపత్ ఆధ్వర్యంలో సేకరించిన పోస్ట్ కార్డులను ఆదివారం స్థానిక హెడ్ పోస్టాఫీస్ కార్యాలయం నుంచి పోస్టు ద్వారా రాష్ట్రపతికి పంపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ.... ఏఐసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా పోస్ట్ కార్డులు సేకరించి రాష్ట్రపతికి పంపించే క్రమంలో భాగంగా మదనపల్లెలో ఎన్ఎస్ యూఐ ఆధ్వర్యంలో సేకరించిన పోస్ట్ కార్డులను రాష్ట్రపతి కి పంపుతున్నామన్నారు. ఈసీ తో కలిసి కేంద్ర ప్రభుత్వం ఓట్ల దొంగతనానికి పాల్పడుతుందని, దేశం యావత్తు ప్రజలకు తెలిసిపోయిందన్నారు. ఈసీ ప్రెస్ మీట్ పెట్టి కేవలం బిజెపికి తొత్తుగా మాట్లాడిందే తప్ప వారి చిత్తశుద్ధినే ఎక్కడ నిరూపించుకోలేకపోయిందన్నారు. కావున ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ మేలుకొల్పే విధంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షులు సంపత్, రాష్ట్ర కార్యదర్శి తేజ, మదనపల్లె కాంగ్రెస్ పార్టీ టౌన్ మాజీ కార్యదర్శి మహమ్మద్ అలీ, విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి : వైసీపీ

**పత్తికొండ -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 07:**వైఎస్ఆర్ పార్టీ ఆధ్వర్యంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ పై,ఉల్లి,టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈనెల 9వ తారీఖున మంగళవారం అన్నదాత పోరు కార్యక్రమంలో రైతులు, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుతూ పత్తికొండ వైఎస్ఆర్ పార్టీ మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో పోస్టర్ రిలీజ్ చేసిన వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



# మదనపల్లె మెడికల్ కాలేజీను ప్రభుత్వమే నడపాలి

- ప్రజాధనంతో నిర్మించిన మెడికల్ కళాశాలలను కార్పోరేట్ లకు తాకట్టు పెట్టడం ఏంటి..?
- వైద్యం వ్యాపారమైతే ప్రజల ప్రాణాలకు ధర కట్టడమే
- పిపిపి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి
- ప్రైవేటీకరణ కు వ్యతిరేకంగా 15న మహా ధర్నా
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల పిలుపు




**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :** మదనపల్లె మెడికల్ కాలేజ్ ను ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రైవేటీకరణ ను వ్యతిరేకిస్తూ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. పట్టణంలోనా స్థానిక ప్రెస్ క్లబ్ నందు ఆదివారం మదనపల్లె అభివృద్ధి వేదిక, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ స్వాగతం పలుకగా, సిఐటియు జిల్లా కోశాధికారి, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు హరినాథ్ శర్మ అధ్యక్షత వహించారు. జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు, యూటిఎఫ్ నాయకులు పురం వెంకటరమణ, బహుజనసేన శ్రీచందు, కాంగ్రెస్ రెడ్డి సాహెబ్‌లు మాట్లాడుతూ మదనపల్లె మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలో నిర్వహించాలన్నారు. పిపిపి విధానం ద్వారా పేద, బడుగు బలహీన ప్రజానీకానికి వైద్యం అందని ద్రాక్షలా మారుతుందని, అంతే కాకుండా బలహీన వర్గ విద్యార్థులకు రిజర్వేషన్ల ద్వారా పొందే హక్కు కూడా కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో వారికి కేటాయించడం తో పేద ప్రజలకు వైద్యం ఖరీదుగా మారిం దన్నారు. అదే పద్ధతిలోనే ఈరోజు మదనపల్లి మెడికల్ కళాశాల కూడా పిపిపి విధానం ద్వారా నిర్మిస్తామని చెప్పడమంటే పేదలకు వైద్యం, పేద విద్యార్థులకు వైద్య చదువు దూరం చేయడమే తప్ప మరొకటి కాదన్నారు. రాష్ట్రంలో ప్రతి పార్లమెంట్ లో మెడికల్ కళాశాల ఉండాలన్న దృష్టితో గత ప్రభుత్వం కాలేజ్ లను తీసుకొస్తే, కూటమి ప్రభుత్వం మాత్రం ఆ మెడికల్ కళాశాలను పిపిపి విధానం ద్వారా ప్రైవేట్ వారికి అప్పజెప్పాలనుకోవడం దుర్మార్గమన్నారు. పులివెందుల తదితర కళాశాలలకు ఎంసిఐ అనుమతులు ఇస్తే కూటమి ప్రభుత్వం వాటిని తోసిపుచ్చడం, మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయాలనుకోవడం వెనుక వాణిజ్య లాభం, కమీషన్ల కోసం తప్ప ప్రజలపై బాధ్యత అనే భావన లేదని దుయ్యబట్టారు. ఒక్కో మెడికల్ కళాశాల నుంచి రూ. 500 కోట్ల నుంచి రూ. 1,000 కోట్ల వరకు కమీషన్లు తీసుకునే ప్రక్రియలో భాగంగానే కూటమి సర్కార్ ప్రైవేటీకరణకు ఒడిగడు తోందన్నారు. వేలాది మంది పేద విద్యార్థులకు వైద్యవిద్య సీట్లు దక్కనీయకుండా వారి ఆశలపై నీళ్లు చల్కు తోందన్నారు. ఇక సామాన్యులు ఎంత కష్టపడి చదువు తున్నా, పోటీని ఎదుర్కోవడంలో సీటు దక్కక, రష్యా, ఉక్రెయిన్, ఫిలిప్పైన్స్, రష్యా తదితర దేశాలకు వెళ్లాల్సి వస్తోందని వివరించారు. పిల్లల చదువుల కోసం తల్లి దండ్రులు తమ పొలాలు, ఆస్తులను అమ్ముకుంటూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారన్నారు.

ఆదోని, పెనుగొండ, పులివెందుల, మదనపల్లె వంటి రాయలసీమ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలని క్యాబినెట్ మీటింగ్ లో నిర్ణయం తీసుకోవడం వెనుక ప్రాంతీయ వివక్ష స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇదంతా పక్కా ప్రణాళికతో, వైద్య విద్యను వ్యాపారంగా మలచాలన్న కుట్రే నని విమర్శించారు. చంద్రబాబు నాయుడు ముందు నుంచి కూడా ప్రైవేటీకరణ పై మొగ్గుచూపుతూ, ప్రభుత్వ సొమ్ముతో కట్టిన వాటినన్నిటినీ ప్రైవేట్‌కు అప్పచెప్పి సొమ్ములను దండుకోవడం అలవా టేనన్నారు. ఆర్ టి సి ని కూడా ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నం చేశారని, ఇప్పుడు ఫైబర్ నెట్ కానీ, ఆరోగ్యశ్రీని ప్రైవేట్ ఇన్స్యూరెన్స్ వాళ్లకు అప్ప చెప్పుచు న్నారన్నారు.

**పిపిపి ప్రైవేటీకరణ ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 15న మహాధర్నా**

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం తక్షణమే వెనక్కి తగ్గాలని వక్తలు డిమాండ్ చేశారు. లేకపోతే మదనపల్లి పట్టణంలో ప్రజ లను, విద్యార్థులను, మేధావులను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ మేరకు ఈనెల 15న మహా ధర్నాకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆలోచనా విధానాన్ని మార్చుకోకపోతే, ఇది విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే చారిత్రక తప్పిదంగా నిలిచిపోతుందన్నారు. వైద్యం వ్యాపారంగా మారితే, ప్రాణాన్ని డబ్బుతో కొలవాల్సి వస్తు ందని, ప్రభుత్వ వైఖరి మారకపోతే, ప్రజలే మార్చే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

ఈ రౌండ్ టేబుల్ సమా వేశా నికి సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు, రిటైర్డ్ వైస్ ఛాన్సలర్ రామకృష్ణారెడ్డి, యుటిఎఫ్ జిల్లా నాయకులు పురం వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ రెడ్డి సాహెబ్ బహుజన శ్రీచందు, రిటైర్డ్ ఎంఈఓ రెడ్డప్ప రిటైర్డ్ హెడ్మాస్టర్ ఉత్తన్న, ప్రముఖ న్యాయవాది సోమశేఖర్, పోస్టల్ డిపార్ట్మెంట్ రెడ్డప్ప, నాగరాజు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృతేజ, జిల్లా అధ్యక్షుడు సంపత్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రీద్, బన్నీ, సుల్తాన్, ప్రేమ్, మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ రామకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ఇతర ప్రజా సంఘాల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎరువులు అందించడంలో

# కూటమి ప్రభుత్వం విఫలం

- బ్లాక్ మార్కెట్ దందాపై పోరుబాట
- వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్




**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :** అన్నదాతలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తోందని, అవసరమైన సమయంలో ఎరువులు అందించడంలో వైఫల్యం చెందిందని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శలు గుప్పించారు. ఆదివారం వైసిపి కార్యాలయంలో నిస్సార్ అహమ్మద్ ఆద్వర్యంలో ఎరువుల బ్లాక్ మార్కెట్ పైన అన్నదాత పోరుబాట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ ఎరువుల బ్లాక్ మార్కెట్ పైన వైసిపి ఆద్వర్యంలో ఈనెల 9 న అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటిలో నిరసన కార్యక్రమం నిర్వ హించి, జిల్లాకలెక్టర్‌కు వినతిపత్రం అందజే స్తామ న్నారు. సకాలంలో రైతాంగానికి ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి రైతాంగానికి సరైన మద్దతు లేకపోవడంతో ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మామిడి, టమోటా, అల్లనేరెడు రైతాంగానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టడులు సైతం అందక తీవ్ర నష్టానికి గురైయ్యారని వివరించారు. ఎన్నికలకు ముందు అధికారమే పరమావధిగా ఇచ్చిన హామీలు అధికారం లోకి వచ్చిన తరువాత విస్మరించారని దుయ్యబట్టారు. టమోట రైతాంగాన్ని ఆదుకుంటామని, పల్ప్ పరిశ్రమ, ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని ఎప్పుడు నేరవేరుస్తారని ప్రశ్నించారు. ఇప్పటికీ 14 నెలలు గడచిపోయాయి, మరో రెండేళ్ళకైనా ఆలోచన చేస్తారా అని ప్రశ్నించారు. మదన పల్లె జిల్లా ఏర్పాటు పైన ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలన్నారు. రైతాంగం యూరియా కోసం నానాపాట్లు పడుతూ, ఒక్క బస్తా కోసం పడిగాపులు కాయల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి కి మద్దతుగా నిలిచిన రైతాంగానికి యూరియా ఇవ్వకుండా అధికారులపై వత్తిడి తెస్తున్నారన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరికి న్యాయం చేశాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహమ్మద్ ప్రవక్త

# జీవిత చరిత్ర ను ప్రతి ఒక్కరూ అనుసరించాలి

**లక్కిరెడ్డిపల్లె-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7 :**జమియతే ఇత్తేహాదుల్ హింద్ లక్కిరెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో, మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్రపై ఆదివారం పెద్ద ఎత్తునా ఒక పెద్ద జల్సా లక్కిరెడ్డిపల్లి లో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా జమియతే ఉల్మా హింద్ జనరల్ సెక్రటరి ముఫ్తి మాసూమ్ సాబ్ హాజరయ్యారు. మొహ మ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు ముఫ్తి మాసూమ్ సాబ్ చేతుల మీదగా మొదటి స్థానంలో వచ్చిన షేక్ కలిముల్లాహ్‌కు మొదటి బహుమతిగా రూ.10 వేలు,రెండవ




బహుమతి షేక్.మహ్మద్ గౌస్‌కి రూ.5 వేలు, మూడవ బహుమతిగా షేక్ అలి ఇస్రా సుల్తానాకి రూ.3 వేలుతో పాటు సర్టిపికేట్ లును సిఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్ర బాబు చేతుల మీదుగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్ర మంలో పెద్ద ఎత్తున ముస్లిం పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



## సూపర్ సిక్స్ -సూపర్ హిట్

**- అనంతపురం పర్యటనకు విచ్చేసిన తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పళ్ళ శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్**





**పామిడి -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7** :తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంతకల్లు మాజీ శాసన సభ్యులు ఆర్. జితేంద్ర గౌడ్ యువనేతలు పవన్ గౌడ్, అనిల్ గౌడ్ మర్యాద పూర్వకంగా పుష్పగుచ్చం అందజేసి జిల్లాకు సాదర స్వాగతం పలకడం జరిగింది. అనంతరం ప్రత్యేకంగా వారితో జితేంద్ర గౌడ్ సమావేశం అవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ నేతలు:టీ.కేశప్ప, వీరభద్రయ్య, కురుబచంద్రశేఖర్, శ్రీరాములు గౌడ్, మహమ్మద్ ఆలీ,రంగా, ముక్కన్న రామాంజినేయులు, శివప్ప తదితరులు నేతలు పాల్గొన్నారు.

### ఆపదలో ఆదుకునేందుకే
## సీఎం సహాయ నిధి: ఎమ్మెల్యే



**మదనపల్లె -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :** ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకే సీఎం సహాయనిధి ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నామని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. మదనపల్లె మండలంలోని పలు గ్రామాలలోని ఆదివారం ఎమ్మెల్యే పర్యటించి ఆరోగ్యం బాగాలేక, ఆస్పత్రి ఖర్చులకు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరు అయిన రూ.15లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఒక్కొ క్కరికే పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పేదల పక్షాన పనిచేస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పేదలకు పథకాలను అందజేస్తున్నారని ఈ సందర్బంగా ఎమ్మెల్యే తెలిపారు.

### బాధితులను
## పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7:** డెంగ్యూ జ్వరంతో కర్నూల్‌లోని ఆకాష్ హాస్పిటల్‌లో పొందుతున్న పత్తికొండ మండలం చందోలి గ్రామం సుచిత్ర , రక్షతలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ అలాగే పిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్ లోని జంకేర్ కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నటువంటి పత్తికొండ మండలం చిన్న హూల్తి గ్రామ సర్పంచ్ కేశవరెడ్డిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లను సర్పంచులు ,డెంగ్యూ జ్వరం పిల్లలను మెరుగైన వైద్య సదుపాయం చేకూరాల మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అమ్మ కోరారు.

### ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు
## పొందిన వరలక్ష్మికి ఘన సన్మానం

**పెళ్ళకూరు- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 07:**విద్యా రంగంలో విశేష సేవలందిస్తున్న ఉపాధ్యాయులను గౌరవించడం ఎంతో గొప్ప సంప్రదాయం అని నాయుడుపేట మొదలియార్ సంఘం పేర్కొంది. 2025వ సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయురాలిగా నాయుడుపేట మండల పరిధిలో విన్నమాల మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయురాలు చిన్నంభేటి వరలక్ష్మి ఎంపిక కావడంతో, ఆదివారంనాడు సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు.సంఘం అధ్యక్షులు కందమూడి పలని మొదలియార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన కరీం భాయ్ చెంచు సుబ్రహ్మణ్యం మొదలియార్, సాయిబాబా మొదలియార్, పల్లేటి రమణయ్య మొదలియార్, కూన మురళి మొదలియార్, లొడారి మురళి మొదలియార్, జయరామ్ మొదలియార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి అత్యంత ప్రశంసనీయమని పేర్కొన్నారు. వరలక్ష్మి వంటి ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు మరింత ప్రేరణనిచ్చేలా కొనసాగాలని ఆకాంక్షించారు.



# టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కట్టేది ఎవరు..?

**- టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కే పరిమితమా**
**- ఇంకెన్ని రోజులు పత్తికొండ ప్రజలను మోసం చేస్తారు**
**- రైతులకు గిట్టుబాటు ధర అందించని ఎన్డీఏ ప్రభుత్వం**
**- కనీస వసతులు లేక ఇబ్బంది పడుతున్న రైతులు**
**- పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ**



**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7:**పత్తికొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అడ్వకేట్ క్రాంతి నాయుడు మాట్లాడుతూ మా పోరాట ఫలితం పోయిన ప్రభుత్వాల నాయకులు ఇక్కడ టమాటా అసలు జూస్ కి దేనికి పనికి రాదు అంటే, డిపిఆర్‌లు సబ్మిట్ చేసి ప్రాసెసింగ్ చేయొచ్చు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తే పోయిన వైసీపీ ప్రభుత్వంలో మొదట ప్యాపిలి దగ్గర ఏర్పాటు చేస్తాం అంటే మళ్ళ పోరాడి పత్తికొండ కు తెచ్చుకున్నాం. పత్తికొండ లో శంకుస్థాపన అని హడావిడి చేశారు అప్పటి నాయకులు, చేసింది ఏమీ లేదు, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వ నాయకులు పత్తికొండ నుండి కనికదిన్నె కు తీసుకొని పోయి ఆరు నెలలో పూర్తి చేసి పంట వచ్చే టైమ్ కి సిద్ధం చేస్తాం అని చెప్పి కనీసం ఒక ఇటుక కూడా వేయలేదు. అసలు ఈ ప్రభుత్వం ఏం చేసింది, ఏం నిధులు ఇచ్చింది, ఏం నిధులు తెచ్చింది. పోయిన ప్రభుత్వంలో శాంక్షన్ అయిన నిధులనే వీళ్ళు ఏదో తెప్పించాం అన్నారు మరి కార్యరూపం ఎక్కడ..? పత్తికొండ రైతులకు మార్కెట్ బయట క్రయవిక్రయాలు జరిగి అన్యాయం జరుగుతుంటే పోరాడి మార్కెట్ యార్డ్ లో ఉంటే రేటు స్థిరీకరణ ఉంటుంది అని పోరాడితే, ఇప్పుడు కూడా కనీస మద్దతు ధర లేదు, మార్కెట్ లో కనీస వసతులు లేవు, కాంగ్రెస్ ప్రభుత్వం లో చేసిన నిర్మాణాలు తప్ప ఈ పదేళ్లలో ఈ ప్రభుత్వాలు చేసింది శూన్యం. వచ్చిన రైతులకు కనీస వసతులు లేవు వచ్చే రైతుల సంఖ్య బట్టి ఉండాల్సిన సౌకర్యాలు ఎక్కడా లేవు. పది పర్సెంట్ కమిషన్ తో రైతులను నిలువునా దోచుకుంటున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్న అధికారులు, నాయకులు. మార్కెట్ యార్డ్ కమిటీ అసలు ఏమి చేస్తున్నారు అనేది వాళ్ళే ఆత్మ పరిశీలన చేసుకోవాలి అని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని లేకపోతే రైతుల కోసం మరోసారి ధర్నా, రాస్తారోకో చేస్తాం అని తెలియజేశారు.

# ‘అన్నదాత పోరు’ పోస్టర్లు ఆవిష్కరణ

**- సీఎం గారు రైతులను ఆదుకోండి : మెట్టు గోవిందరెడ్డి**



**రాయదుర్గం -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 7 :** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాత పోస్టర్లను రాయదుర్గం వైసీపీ ఇన్చార్జి మెట్టు గోవింద రెడ్డి నివాసంలో వైసిపి నాయకులు కార్యకర్తలు రైతులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సకాలంలో రైతులకు ఎరువులు అందించక, రైతులను ముంచారని రాయ దుర్గం వైసీపీ ఇన్చార్జి మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రైతుల కష్టాలు వర్ణణాతీం .

**గత ఏడాది అతివృష్టి, అనావృష్టితో నష్టపోయారు:** అనంతపురం జిల్లాలో గత ఖరీఫ్, రబీలో వర్షాభావ పరిస్థితులతో పంటలన్నీ దెబ్బతిన్నాయి. పెట్టుబడి కూడా తిరిగిరాలేదు. ప్రభుత్వం ఆదుకోలేదు. ఈ ఏడాది ప్రకృతి కరుణ లేదు.. ప్రభుత్వ సహకారం లేదు. ఫలితంగా రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది.గత ఏడాది కంటే ఎక్కువ యూరియా పంపించామని చెబుతున్నా ఇంకా యూరియా కొరత వేధిస్తోంది. యూరియా కోసం ఎక్కడ చూసినా రైతులు బారులు తీరుతున్నారు. రైతు సమస్యలపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఈనెల 9న తేదీన కళ్యాణదుర్గం వాల్మీకి సర్కిల్ నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వించారు కావున రాయదుర్గం నియో జకవర్గం రైతులు, 5 మండల కన్వీనర్లు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, సర్పంచులు, టౌన్ కౌన్సిలర్లు, అనుబంధ విభాగ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర ముఖ్య నాయకులు, ప్రదాపతులు ర్యాలీల్లో పెద్ద ఎత్తున రైతులు పాల్గొనాలని కోరుతున్నాం అని పిలుపునిచ్చారు.



# ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ చేపట్టాలి

**- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్**



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 07** : పకడ్బందీ ప్రణాళిక ప్రకారం యూరియా పంపిణీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి యూరియా పంపిణీపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, మార్క్ ఫెడ్ డిఎం, ఏపీఎంఐపి పిడి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ప్రైమరీ సెక్టార్ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు, తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా పంపిణీ ప్రణాళిక రూపొందించాలని, దాని ప్రకారం యూరియా పంపిణీ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. యూరియా కోసం జిల్లాలో ఎక్కడా పెద్ద క్యూలైన్ ఉంది అనేది రాకూడదన్నారు. ఏ మండలానికి ఆ మండలానికి యూరియాను ఖచ్చితంగా పంపించాలని, సంబంధిత మండల రైతులు ఆ మండలంలోనే యూరియా తీసుకొనేలా చూడాలని, వేరే మండలానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు యూరియా పంపిణీ ప్రణాళిక ప్రకారం జరగాలన్నారు. యూరియా పంపిణీలో మండల అధికారులు 100 శాతం జాగ్రత్తగా, పద్ధతిగా, సీరియస్ గా పని చేయాలన్నారు. ఆయా మండలాల్లో సాగు విస్తీర్ణం ప్రకారం వచ్చే సోమవారం నుంచి ఆదివారం దాకా రైతు సేవా కేంద్రాలకు, ప్రైవేట్ వారికి ఈ వారంలో ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుంది అనేది చూసు కొని, ఎంత స్టాక్ కావాలో తెలియజేయాలన్నారు. ఆయా కేంద్రాలకు విఆర్వోలను నియమించాలన్నారు. ఈ సీజన్లో ఈ పంట నమోదును పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, మార్క్ ఫెడ్ డిఎం పెన్నేశ్వరి పాల్గొన్నారు.

# వేణురెడ్డి ఆరోగ్యంపై విచారించిన కామిరెడ్డి సత్యనారాయణ

**పెళ్లకూరు-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 07:**
మండలంలోని చెంబేడు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బెల్లపు వేణురెడ్డి ని ఉమ్మడి నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ ఆదివారం పరామర్శించారు.ఈ సంద ర్భంగా ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు ఒబ్బు వెంకటరత్నం, వైస్ ఎంపిపి బెల్లపు వెంకట రాఘవ రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీపురం మునిరాజ, వైసీపీ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మూరతొట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



### ఇప్పుడు ఏం చేద్దాం...

# రాధా కార్యకర్తలతో మంతనాలు



**విజయవాడ-సూర్య వాస్తవం:** బెజవాడలో ఆ లీడర్‌కి సీనియారిటీ ఉన్నా? కాలం కలిసి రావడం లేదా? వాళ్ళు పోతే వీళ్ళు, వీళ్ళు పోతే వాళ్ళు అంటూ? పదిహేనేళ్ళు వెయిట్ చేశాం. ఇక మావల్ల కాదని ఆ నేత అనుచరగణం ఎందుకు అంటోంది? తమ నాయకుడిని వాళ్ళు ఎలా చూడాలను కుంటున్నారు? ఇప్పు డాయన ఎలా ఉన్నారు? అసలింతకీ ఎవరా లీడర్? ఏంటాయన ఎదురుచూపుల కథ? బెజవాడ రాజకీయాల్లో వంగవీటి పేరు ఒక బ్రాండ్. ఇంకా చెప్పుకోవాలంటే? ఏపీ పాలిటిక్స్ మొత్తాన్ని కూడా ప్రభావితం చేయగలిగిన పేరు అది. దివంగత వంగవీటి రంగా కుమారుడిగా? రాధాకి కూడా అదే గుర్తింపు ఉంది. తండ్రి ఒకసారి, తల్లి రెండు విడతలు ఎమ్మెల్యేలు అవగా? రాధా ఒక్క విజయానికే పరిమితం అయ్యారు. 20 ఏళ్ల రాజకీయ జీవితంలో మూడు సార్లు పోటీ చేసి ఒక్కసారి మాత్రమే గెలవగలిగారాయన. మొత్తం ఐదు ఎన్నికల్ని చూసిన రాధా? రెండు విడతలు పోటీకి దూరంగా ఉన్నారు. అత్యంత చిన్న వయసులో ఎమ్మెల్యే అయిన రికార్డ్ ఆయన పేరిట ఉన్నా? ఆ ఒక్కసారి మినహా? మరెప్పుడూ ఆయన పవర్‌లోలేరు. ఇపుడు అదే? ఆయన సొంత కేడర్‌ని కలవరపెడుతోందట. తొలిసారి 2004లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి మొదటి ప్రయత్నంలోనే ఎమ్మెల్యే అయ్యారు రాధా. అప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కూడా అధికారంలోకి వచ్చింది. ఆ ఐదేళ్ళు మాత్రమే ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ తర్వాత నుంచి రాధా పొలిటికల్ కెరీర్ పరిశీలిస్తే.. ఎన్నడూ అధికారంలో లేరు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఓడిపోయి అధికారానికి దూరమయ్యారు. 2014లో వైసీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నారు.ఇక 2019లో టిడిపిలో చేరినా?. అప్పుడు ఆ పార్టీకి పవర్ పోయింది. ఈ క్రమంలో? 2024లో వైసీపీలో చేరాలని ప్రతిపాదనలు వచ్చినా? ఆయన మాత్రం టిడిపిలోనే కొనసాగి 20 ఏళ్ల తర్వాత అధికార పార్టీలో ఉన్నారన్నది వంగవీటి వర్గం మాట. నిలకడ లేకుండా? ప్రతి ఎన్నికల టైంలో గెలవబోయే పార్టీ నుంచి ఓడిపోయే పార్టీలోకి వెళ్ళటం ద్వారా అధికారం, పదవులు రాధాకు దక్కకుండా పోయాయన్నది ఆయన వర్గం మాట. అదంతా ఒక ఎత్తయితే? ఇప్పుడు అధికార పార్టీలో ఉన్నాసరే? ఆయనకు పదవులు దక్కడం లేదన్న ఆవేదన పెరుగుతోందట వంగవీటి అభిమానుల్లో. తెలుగుదేశం పార్టీలో రాధా చేరినప్పుడు ఆయనపై సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు వచ్చినా ఖాతరు చేయలేదు. పార్టీకి స్టార్ క్యాంపెయినర్ గా ఎన్నికల్లో పనిచేశారు. ఈసారి గెలిచిన తర్వాత రాధాకు కచ్చితంగా ఎమ్మెల్సీ ఇస్తారని ఆశపడింది ఆయన వర్గం. అధిష్టానం కూడా అంతకు ముందే హామీ ఇచ్చిందని, ఈసారి పార్టీ అధికారంలోకి వస్తే రాధాను ఎమ్మెల్సీగా చూస్తామని ఆయన వర్గం వెయిట్ చేసింది. తనకు ఫలానా పదవి కావాలని రాధా ఎప్పుడూ అడగలేదని, ఆయనకు పదవుల మీద పెద్దగా వ్యామోహం లేదని అంటున్నా? మానేతను ఒక హోదాలో చూడాలన్నది వంగవీటి అభిమానుల ఆశగా చెప్పుకుంటున్నారు. ఆ మధ్య ఖాళీ అయిన ఎమ్మెల్సీ సీట్లలో ఛాన్స్ దక్కకపోవడంతో?మళ్ళీ అవకాశం రావాలంటే? 2027దాకా ఎదురు చూడక తప్పని పరిస్థితి.

దీంతో ఇంకెన్నాళ్ళు ఈ వెయిటింగ్ అంటూ డీలా పడుతున్నారట మాజీ ఎమ్మెల్యే అనుచరులు. తమ నాయకుడికి పదవులపై ఆశ లేకపోయినా తాము మాత్రం ఆయన్ని చట్టసభలో చూడాలని కోరుతున్నామన్నది వాళ్ళ మాట. అందుకోసం 15 ఏళ్లుగా వెయిట్ చేస్తున్నామని, టీడీపీ అధిష్టానం ఇకనైనా గుర్తించి ఆయన స్థాయికి తగ్గ పదవి ఇవ్వాలని కోరుతున్నారట. ఇన్నాళ్ళు అవకాశం లేక వెయిటింగ్ లో ఉన్నామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కూడా వెయిటింగ్ అంటే? ఇబ్బందేనంటూ మనసులో మాట బయట పెడుతోందట వంగవీటి అనుచరగణం. దీన్ని టీడీపీ అధిష్టానం ఎలా తీసుకుంటుందో చూడాలి మరి.

# ఉత్తరాంధ్రపై కూటమి ఫోకస్



**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:** చంద్రబాబు- పవన్ ఫోకస్ అక్కడే. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి జపం చేశారని ఉత్తరాంధ్రని విస్మరించారని విమర్శలు ఉన్నాయి. ఏపీలో టీడీపీ కూటమి నేతలు ఉత్తరాంధ్ర మీద పూర్తి ఫోకస్ పెట్టేశారు అందుకే వరుసగా పర్యటనకు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఒకరి తరువాత ఒకరు ఉత్తరాంధ్రాకు వస్తూనే ఉన్నారు. చంద్రబాబు విషయమే తీసుకుంటే గత నెల 29న వచ్చి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్న బాబు సెప్టెంబర్ 2న మరోసారి విశాఖ వచ్చి స్థానిక అధికార కార్యక్రమాల్లో పాల్గొన్నారు తిరిగి ఈ నెల 5న ఆయన విశాఖ వస్తున్నారు. ఒక వారంలో మూడు సార్లు బాబు రావడం అంటే రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే గత నేల చివరిలో నాలుగు రోజుల పాటు విశాఖలో ఉన్నారు ఆయన జనసేన పార్టీ సమావేశాలను నిర్వహించారు బహిరంగ సభతో ఆయన విశాఖ జనాలను పలకరించారు. తిరిగి పవన్ కళ్యాణ్ ఈ నెల 5న విశాఖ వెళ్లారు ఆయన అల్లూరి జిల్లా అరకులోని గిరిన ప్రాంతాలలో పర్యటన చేస్తున్నారు. ఆదివాసీల పండుగలో ఆయన పాల్గొంటారు అని అంటున్నారు. నారా లోకేష్ కూడా గత నెలలో మూడు రోజుల పాటు విశాఖలో ఉంటూ స్థానికంగా ప్రభుత్వ ప్రైవేటు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆయన ఢిల్లీ పర్యటన తరువాత వచ్చే వారంలో విశాఖకు వస్తారని అంటున్నారు. కూటమిలోని ముగ్గురు అగ్ర నాయకులు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర మీద దృష్టి పెట్టడానికి కారణం ఈ ప్రాంతాన్ని తాము విస్మరించడం లేదని బలంగా చెప్పడానికే అని అంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అమరావతి జపం చేశారని ఉత్తరాంధ్రని విస్మరించారని విమర్శలు ఉన్నాయి. దానిని వైసీపీ కూడా హైలెట్ చేసింది. దాంతో 2019 ఎన్నికల్లో టీడీపీ బాగా దెబ్బ తిన్నది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజధాని విశాఖ అని ప్రకటించింది కానీ అమలు చేయలేకపోయింది. విశాఖ వాసులతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలు రాజధాని అమరావతిగా ఉండడానికి సమ్మతి తెలిపినా తమ ప్రాంతం కూడా అభివృద్ధి చెందాలని తీవ్రంగా కోరుకుంటున్నారు. ఈ విషయంలో ఎలాంటి రాజీ అయితే లేదని అంటున్నారు. ఇపుడు చూస్తే అమరావతి చుట్టూనే కూటమి ప్రభుత్వం ఆలోచనలు ఎక్కువగా తిరుగుతున్నాయని వైసీపీ విమర్శిస్తోంది. తాజాగా వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ మీడియాతో మాట్లాడుతూ విశాఖలో ఈవెంట్లు అమరవతిలో పేమెంట్లు అని హాట్ కామెంట్స్ చేశారు. విశాఖను కేవలం వాడుకుని వదిలేస్తున్నారు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బహుశా ఇలాంటి విమర్శలు కూడా కూటమిని ఆలోచనల్లో పడవేసి ఉంటాయని అంటున్నారు అందుకే ఉత్తరాంధ్రాను తాము ఎంతగానో అభివృద్ధి చేస్తున్నామని చెప్పడానికి వరసగా పర్యటనలు చేయడమే కాకుండా ఎవరో ఒకరు తరచూ అధికారిక పర్యటనలతో ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా జనాలలో ఉండేలా చేసుకుంటున్నారు అని అంటున్నారు. అయితే మాటలు ప్రకటనలు ఎంత ఘనంగా ఉన్నా అభివృద్ధి కూడా అంతే గంభీరంగా సాగితేనే ఫలితం ఉంటుంది అని అంటున్నారు.




# 18 నుంచి అసెంబ్లీ




**విజయవాడ-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సెప్టెంబర్ 18, 2025 నుంచి వెలగపూడిలోని అసెంబ్లీ హాలులో ప్రారంభం కాను న్నాయి. ఈ సమావేశాలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ జారీ చేశారు. సమావేశాలు 10 రోజుల పాటు జరిగే అవకాశం ఉంది. బీఏసీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారు. శాసనసభ సమావేశాలు సెప్టెంబర్ 18న ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుం డగా, శాసనమండలి సమావేశాలు అదే రోజు ఉదయం 10 గంటలకు మొదలవుతాయి. సమావేశాల వ్యవధిని ఉభయ సభలు విడివిడిగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల ద్వారా నిర్ణయిస్తారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ సమావేశాల ఏర్పాట్ల గురించి ముందుగానే వివరాలు వెల్లడించారు. ఈ సమావేశాల్లో రాష్ట్రంలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలు, అమరావతి అభివృద్ధి, బనకచర్ల ప్రాజెక్ట్ వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా రాష్ట్రంలోని ముఖ్యమైన సమస్యలు , ప్రభుత్వ పథకాల పురోగతిని వివరించే అవకాశం ఉంది. పలు కీలక బిల్లులకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, మునుపటి ప్రభుత్వం నుంచి వచ్చిన సవాళ్లు, ప్రస్తుత ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కూడా చర్చలు జరిగే అవకాశం ఉంది. సమావేశాలకు ముందు, సెప్టెంబర్ 14 , 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేల కోసం ఒక ప్రత్యేక సదస్సు నిర్వహిం చనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు ఈ సదస్సుకు హాజరవుతారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. మొదటి రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారు, ముగింపు రోజున గవర్నర్ కూడా పాల్గొంటారు. ఈ సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు తిరుమల శ్రీవారి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్ఆర్‌సీపీ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యే అవకాశం కనిపించడం లేదు. జగన్ కు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకపోతే తాము వచ్చేది లేదని ఇప్పటికే తేల్చేశారు. అయితే వరుసగా అరవై రోజుల పాటు సభకు రాకపోతే అనర్హతా వేటు వేసే అధికారం సభకు ఉంది. ఈ దిశగా చర్యల గురించి ఆలోచిస్తామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చెప్పారు. అందుకే ఈ అసెంబ్లీ సమావేశాలు హాట్ టాపిక్ గా మారనున్నాయి.గత సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి జగన్ సహా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అయితే ప్రసంగం ప్రారంభమైన ఐదు నిమిషాల్లోనే వారు గవర్నర్ ప్రసంగ పాఠాలు చించి వేస్తూ.. నినాదాలు చేస్తూ బయటకు వెళ్లిపోయారు. అధికారికంగా తాము సభకు హాజరైనట్లేనని..అందుకే అనర్హతా వేటు పడదని వారు భావించారు. అది గవర్నర్ ప్రసంగం అనేది బిజినెస్ డే కాదని.. అది లెక్కలోకి రాదని తర్వాత అసెంబ్లీ వర్గాలు చెప్పాయి. అందుకే వైసీపీ ఎమ్మెల్యేల హాజరుపై ఉత్కంఠ ఏర్పడింది.

### 10న అనంతపురంలో

# సూపర్ సిక్స్ విజయోత్సవ సభ




**అనంతపురం-సూర్య వాస్తవం:** ఏపీ సీఎం చంద్రబాబు వైసీపీ ఓటు బ్యాంక్ పై ఫోకస్ పెట్టారా? వైసీపీకి బలమైన ప్రాంతంలో చెక్ చెప్పాలని భావిస్తున్నారా? అందులో కొంత సక్సెస్ అయ్యారా? అదే ఊపును కొనసాగిం చాలనుకుంటున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఈనెల 10న అనంతపురం జిల్లాలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. తద్వారా రాయలసీమ జిల్లాలకు బలమైన సంకేతాలు పంపించనున్నారు. గతంలో రాయలసీమ అంటే తెలుగుదేశం పార్టీకి మైనస్ అని చెప్పుకునేవారు. కానీ గడిచిన ఎన్నికల తర్వాత పూర్తి సీన్ మారింది. ఇదే స్ఫూర్తిని 2029 ఎన్నికల వరకు చాటాలని చంద్రబాబు స్ట్రాంగ్ గా నిర్ణయించుకున్నట్లు సమాచారం.2019 ఎన్నికల్లో రాయలసీమలోతెలుగుదేశం పార్టీ గెలిచింది కేవలం మూడు స్థానాల్లో మాత్రమే. కుప్పం నుంచి చంద్రబాబు, హిందూపురం నుంచి నందమూరి బాలకృష్ణ, ఉరవకొండ నుంచి పయ్యావుల కేశవ్ మాత్రమే గెలిచారు. అటు తరువాత ప్రతి ఎన్నికలోను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తూ వచ్చింది. అయితే 2019 నుంచి 2024 మధ్య రాయలసీమ ప్రజల్లో ఒక రకమైన అభిప్రాయం ఏర్పడింది. దాని ప్రభావం 2024 ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది. స్వల్ప సంఖ్యలో మాత్రమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. ఓ ఆరు చోట్ల మాత్రమే రాయలసీమలో ఆ పార్టీ ప్రభావం చూపింది. టిడిపి కూటమి దాదాపు రాయలసీమలో స్వీప్ చేసింది. అప్పటినుంచి చంద్రబాబుతో పాటు నారా లోకేష్ స్పెషల్గా దృష్టిపెట్టారు రాయలసీమపై. ఒకవైపు రాజకీయంగా.. ఇంకోవైపు అభివృద్ధి పరంగా రాయలసీమపై ఫుల్ ఫోకస్ చేశారు తండ్రీ కొడుకులు. దాని సత్ఫలితాలు వస్తుండడంతో ఇప్పుడు రెట్టింపు ఉత్సాహంతో పనిచేయడం ప్రారంభించారు.గతంలో ఎన్నడూ లేని విధంగా కడప నడిబొడ్డులో మహానాడు నిర్వహించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్ చేశారు. ఒక విధంగా చెప్పాలంటే పులివెందులతో పాటు ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో గెలుపునకు అదే నాంది అయింది. వైసిపి ఆరోపిస్తున్నట్టు అధికార పార్టీ దుర్వినియోగం చేసినా.. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు రాకపోవడం గమనార్హం. ఇదే పట్టు కొనసాగించాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. అందుకే కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకెళ్లి సస్యశ్యామలం చేయాలనుకున్నారు. ఇంకోవైపు పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కూడా భావిస్తున్నారు. పనిలో పనిగా ఈ నెల 10న అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభను నిర్వహించాలని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ సభను ఉభయగోదావరి జిల్లాలో ఏర్పాటు చేయాలని భావించారు. కానీ రాయలసీమలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలంటే అక్కడే నిర్వహించడం కరెక్ట్ అని ఒక నిర్ణయానికి వచ్చారు.

## కోళ్లకు అంతు చిక్కని వ్యాధి

**విజయనగరం --సూర్య వాస్తవం:** అప్పటివరకు ఆ కోళ్లు అటూ ఇటూ తిరుగు తున్నాయి. ఒక్కసారిగా కుప్పకూలిపోతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు.. వారం రోజుల వ్యవధిలో లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. అంతుచిక్కని వ్యాధి తో చనిపోతున్నాయి కోళ్లు. దీంతో పౌల్ట్రీ ఫామ్ వ్యాపారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. విజయనగరం జిల్లాలో కొత్తవలస మండలం విశాఖకు సరిహద్దు ప్రాంతంగా ఉంది. ఆ ప్రాంతంలో వందలాది కోళ్ల ఫారంలు ఉంటాయి. బ్రాయిలర్ కోళ్ల జోన్ గా కూడా ఉంది. విజయనగరం జిల్లాకు సంబంధించి కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట.. విశాఖ జిల్లాకు సంబంధించి కోటపాడు, దేవరపల్లి మండలాల్లో వందల సంఖ్యలో కోళ్ల ఫారం లు ఉంటాయి. అయితే గత వారం రోజులుగా లక్షల కోళ్ళు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది.రామలింగాపురం లోని ఓ కోళ్ల ఫారంలో రెండు రోజుల వ్యవధిలో 38వేల నాటు కోళ్లు చనిపోయాయి. దీంతో ఇది వైరస్ అని తేలిపోయింది. ముందుగా బ్రాయిలర్ కోళ్లు లక్షలాదిగా చనిపోయాయి. ఇప్పుడు ఆ వైరస్ నాటు కోళ్లకు సైతం సోకింది. దీంతో ఫారంలలో కోళ్లు చనిపోవడంతో ఖాళీగా కనిపిస్తున్నాయి. రామలింగా పురానికి చెందిన రాంబాబు ప్రియాంక ఆగ్రో ఫారం పేరుతో 13 రేకుల షెడ్లలో 40 వేల నాటు కోళ్లను పెంచుతున్నాడు. అవన్నీ చనిపోవడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యాడు. వాస్తవానికి బ్రాయిలర్ కోళ్లతో పోల్చుకుంటే నాటు కోళ్లు వ్యాధులకు తట్టుకుంటాయి. అటువంటి కోళ్లు ఇప్పుడు మృత్యువాత పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా డిసెంబరు, జనవరిలో కోళ్లు చలికి తట్టుకోలేవు. ఆ సమయంలో ఎక్కువగా చనిపోతుంటాయి. లక్ష కోళ్ళు ఉన్న ఫారంలో 20 నుంచి 50 కోళ్లు ప్రతిరోజు చనిపోవడం సర్వసాధారణం. కానీ అంతకుమించి చనిపోతే మాత్రం ఆలోచించదగ్గ విషయం. కోళ్ల ఫారం నిర్వహకులు దాదాపు 20 వరకు వ్యాక్సినేషన్లు చేస్తారు. ఐ డ్రాప్స్ సైతం వేస్తారు. కానీ ఇప్పుడు అంతు చిక్కని వైరస్ తో కోళ్లు చనిపోతుండడంతో సర్వత్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. మరోవైపు పశుసంవర్ధక శాఖ అధికారులు స్పందించారు. చనిపోయిన కోళ్లకు సంబంధించి శాంపిల్స్ ను సేకరించారు. విజయవాడ ల్యాబ్ కు పంపించారు. అక్కడ నుంచి వచ్చిన నివేదికల ప్రకారం చర్యలు తీసుకోనున్నారు. మరోవైపు చనిపోయిన కోళ్లను పూడ్చి పెట్టాలని.. ఖాళీ చేసిన ఫారాల్లో షెడ్లను శుభ్రం చేయాలంటున్నారు అధికారులు. వ్యాధి సోకిన కోళ్ల వ్యర్థాలను పొలాల్లో ఎరువు కింద కూడా వాడొద్దని సూచిస్తున్నారు. అయితే ఒకేసారి లక్షల కోళ్లు మృత్యువాత చెందడంతో కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. ఇక్కడి కోళ్ల ఫారాలు ప్రముఖ కంపెనీల హేచరీలతో ఒప్పందం చేసుకుంటాయి. కోడి పిల్లలతో పాటు దాణాను కూడా అందిస్తాయి. అయితే ప్రస్తుతం కోడి ఉత్పత్తి అవుతున్న తరుణంలో ఈ వైరస్ రావడంతో భారీగా నష్టపోయారు ఫారం యజమానులు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.







## ఉస్తాద్ భగత్ సింగ్..

# మళ్ళీ బిజీబిజీగా పవన్

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రెండు భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఒకవైపు సుజీత్ డైరెక్షన్‌లో రూపొందుతున్న O G, మరోవైపు హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఉస్తాద్ భగత్ సింగ్. ఈ రెండు సినిమాలపైనా అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. ముఖ్యంగా హరీష్ శంకర్ పవన్ కాంబినేషన్‌కి "గబ్బర్ సింగ్" విజయంతో ఉన్న క్రేజ్ వేరే స్థాయిలో ఉంది. ఇప్పటికే ఉస్తాద్ భగత్ సింగ్ షూట్‌కు సంబంధించిన కొన్ని షెడ్యూల్స్ పూర్తి కాగా, తాజా అప్‌డేట్ ప్రకారం ఈరోజు హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభమైంది. ఇందులో పవన్ కళ్యాణ్ జాయిన్ కావడంతో ఫ్యాన్స్‌లో హైప్ మరింత పెరిగింది. ఈ షెడ్యూల్‌లో పవన్‌తోపాటు హీరోయిన్ రాశి ఖన్నా పాల్గొననున్నారు.

వీరిద్దరిపై డైనమిక్ సాంగ్‌ని తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. దినేష్ మాస్టర్ కొరియోగ్రఫీ చేయనున్న ఈ సాంగ్ కోసం ప్రత్యేక సెట్స్ వేసినట్లు సమాచారం. ఈ షెడ్యూల్ కొన్ని రోజులు కొనసాగనుంది. ఇందులో సాంగ్‌తో పాటు కొన్ని కీలక సన్నివేశాలు కూడా షూట్ చేయనున్నారని ఇండస్ట్రీ టాక్. రాశి ఖన్నా పవన్ స్క్రీన్ కెమిస్ట్రీ ఈ సినిమాకి కొత్త ఫీల్ ఇస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో మరో హీరోయిన్‌గా శ్రీలీల నటిస్తుండటం కూడా సినిమాపై అదనపు ఆకర్షణగా మారింది. ఫ్యాన్స్ అయితే ఈ లేటెస్ట్ షెడ్యూల్ అప్‌డేట్‌తో ఎక్సైట్మెంట్‌లో ఉన్నారు. మైత్రి మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ మాస్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటోంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఇప్పటికే సౌండ్‌ట్రాక్‌పై అంచనాలు పెరిగాయి. త్వరలోనే ఫస్ట్ సింగిల్ రిలీజ్ కానుందని మ్యూజిక్ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, పవన్ కళ్యాణ్ సాంగ్ షూట్‌లో జాయిన్ అవ్వడం సినిమాకు కొత్త ఊపునిచ్చింది. షూటింగ్ ప్రోగ్రెస్ వేగంగా జరుగుతుండగా, ఫ్యాన్స్ మాత్రం ఎప్పుడెప్పుడు సాంగ్ టీజర్ వస్తుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇక ఈ ఏడాది చివర్లో ప్రమోషన్లు స్టార్ట్ చేసి, 2026లో సినిమా రిలీజ్ చేయాలని మేకర్స్ టార్గెట్ చేస్తున్నారు.

## ఆమిర్‌తో

# లోకేష్ కనకరాజ్.. అంతా బుస్



'కూలీ' సినిమాలో ఒక్కో పాత్ర గురించి విడుదలకు ముందు ఇచ్చిన బిల్డప్‌కు, సినిమాలో ఉన్న విషయానికి అసలు పొంతన లేదు. అన్నింటికంటే ఎక్కువ డిజప్పాయింట్ చేసిన క్యారెక్టర్ నాగార్జున చేసిన సైమన్ పాత్రదే. కొన్ని నెలల పాటు నాగ్ వెంట పడి.. ఆరేడుసార్లు నరేషన్ ఇస్తే కానీ నాగ్ ఒప్పుకోలేదని లోకేష్ చెప్పాడు. అంత విషయం ఈ పాత్రలో ఏముందో సినిమా చూసిన ప్రేక్షకులకు అంతుబట్టలేదు.

ఇక బాలీవుడ్ సూపర్ స్టార్లలో ఒకడైన ఆమిర్ ఖాన్.. ఈ చిత్రంలో క్యామియో చేశాడంటే తన పాత్ర మామూలుగా ఉండదని అనుకున్నారు. అదొక సిల్లీ క్యారెక్టర్‌లా తోచింది సినిమా చూస్తే. ఇక 'కూలీ' రిలీజ్‌కు ముందు ఇంటర్వ్యూల్లో లోకేష్ కనకరాజ్.. ఆమిర్ ఖాన్‌తో ఓ సూపర్ హీరో సినిమా చేస్తానని దాని గురించి కూడా తెగ హైప్ ఇచ్చే ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. మీడియాలో కూడా దీని గురించి గొప్పగా రాశారు. తన ఫ్యూచర్ ప్రాజెక్టుల గురించి ప్రతి ఇంటర్వ్యూలో ఇలా హైప్ ఇవ్వడం లోకేష్‌కు అలవాటే. ఐతే తాజా సమాచారం ప్రకారం లోకేష్, ఆమిర్ సినిమా తెరకెక్కే అవకాశమే లేదట. లోకేష్‌కు ఆల్రెడీ చాలా కమిట్మెంట్లు ఉన్నాయి. ఖైదీ-2, విక్రమ్-2, రోలెక్స్.. ఇలా తన గత చిత్రాల్లోని పాత్రలతోనే మూడు సినిమాలు చేయాల్సి ఉంది. వీటి గురించి కూడా ఎప్పట్నుంచో ఊరిస్తున్నాడు తప్ప.. ఏదీ ముందుకు కదలడం లేదు. 'ఖైదీ-2' పక్కా అనుకుంటే.. ఇప్పుడేమో రజినీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్లో మల్టీస్టారర్ అంటూ ఓ ప్రచారం మొదలైంది. ఖైదీ-2 సంగతే తేలట్లేదంటే.. ఇక విక్రమ్-2, రోలెక్స్ సినిమాలు ఉంటాయో లేదో తెలియదు. ఆమిర్ సినిమా అయితే అసలు తెరకెక్కేందుకు ఏమాత్రం అవకాశం లేదన్నది కోలీవుడ్ సమాచారం.

పైగా 'కూలీ'లో ఆమిర్ పాత్ర తుస్సుమనిపించడంతో లోకేష్, ఆమిర్ కాంబినేషన్ మీద ప్రేక్షకులకు పెద్దగా ఆసక్తి కూడా ఉండే అవకాశం లేదు.




# హాకి విజేత భారత్



ఆసియా హాకీ కప్ ఫైనల్లో భారత జట్టు ఘన విజయం సాధించింది. 8 ఏళ్ల తరువాత ఆసియా హాకీ కప్‌ను అందుకుంది. దక్షిణ కొరియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్లో భారత్ 4-1తో విజయం సాధించింది. ఈ గెలుపుతో 2026 హాకి వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ తరపున దిల్‌ప్రీత్ సింగ్ 28, 45 నిమిషాల వద్ద రెండు గోల్స్, చేయగా, సుఖ్జీత్ సింగ్ 1, అమిత్ రోహిదాస్ 50వ నిమిషం నాల్గో గోల్ వేశాడు. కాగా 2022లో గెలిచిన టైటిల్‌ను నిలబెట్టుకుంటున్న దక్షిణ కొరియా ఆటగాడు డైన్ సన్ 51వ నిమిషంలో తమ ఏకైక గోల్‌ను సాధించాడు.హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత జట్టు ఈ టోర్నమెంట్‌ను అజేయ రికార్డుతో ముగించింది. ఐదు విజయాలు, ఒక డ్రా చేసుకుంది. జట్టు తమ మూడు పూల్ మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. సూపర్ 4లో జరిగిన చివరి మ్యాచ్‌లో చైనాను 7-0 తేడాతో ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్, మరో సూపర్ 4 థ్రిల్లర్‌లో మలేషియాను 4-3 తేడాతో ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. అంతకుముందు, మూడవ స్థానం కోసం జరిగిన ప్లే-ఆఫ్ మ్యాచ్‌లో మలేషియా 4-3 తేడాతో చైనాను ఓడించగా, జపాన్ 6-1 తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించి ఐదవ స్థానాన్ని కైవసం చేసుకుంది.

టోర్నమెంట్ అంతటా భారతదేశం నిలకడగా ఆడింది, వారు సూపర్ 4లో ఏడు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు, డిఫెండింగ్ ఛాంపియన్స్ కొరియా నాలుగు పాయింట్లతో రెండవ స్థానంలో ఉంది. ఇక భారత్‌కు ఇది నాల్గో ఆసియా కప్ టైటిల్, గతంలో 2003, 2007,2017లో టోర్నమెంట్ గెలిచింది.





# ఛాంపియన్ సబలెంక

- టైటిల్ నిలుపుకున్న బెలారస్ స్టార్
- ఫైనల్లో ఆమందకు భంగపాటు
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

**న్యూయార్క్ :** ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో పరాజయం. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లోనూ ఓటమి. వింబుల్డన్‌లో సెమీస్‌లోనే చుక్కెదురు. అయినా, అరినా సబలెంక (బెలారస్) పట్టు వదల్లేదు. యుఎస్ ఓపెన్‌లో రెట్టించిన పట్టుదలతో బరిలోకి దిగింది. న్యూయార్క్‌లో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఎనిమిదో సీడ్ ఆమంద అనిషిమోవపై 6-3, 7-6(7-3)తో సబలెంక సూపర్ విజయం సాధించింది. 2014 తర్వాత మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగి టైటిల్ నిలుపుకున్న క్రీడాకారిణిగా సబలెంక నిలిచింది. వింబుల్డన్ ఫైనల్లో 0-6, 0-6తో స్వైటెక్ చేతిలో భంగపడిన ఆమంద అనిషిమోవ.. సొంతగడ్డపై గట్టి పోటీనిచ్చింది. వరల్డ్ నం.1 సబలెంకకు అంత సులువుగా టైటిల్‌ను వదులుకోలేదు. గంటన్నరకు పైగా సాగిన టైటిల్ పోరులో అనిషిమోవ 4 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించింది. సబలెంక ఓ ఏస్‌తో సరిపెట్టినా.. ఆమంద సర్వ్‌ను ఐదు సార్లు బ్రేక్ విజేతగా నిలిచింది. ఆమంద 22 విన్నర్లు కొట్టగా.. సబలెంక 13 విన్నర్లే కొట్టింది. పాయింట్ల పరంగా 76-59తో సబలెంక పైచేయి సాధించింది. సబలెంక 15 అనవసర తప్పిదాలు చేయగా.. ఆమంద 29 అనవసర తప్పిదాలతో టైటిల్‌ను చేజార్చుకుంది.

సబలెంక బలమైన సర్వ్, ఫోర్‌హ్యాండ్ ర్యాలీలను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఆమంద.. తొలి సెట్లో మూడు సార్లు సర్వ్‌ను కోల్పోవటం దెబ్బతీసింది. రెండో సెట్లో 5-4తో మ్యాచ్ పాయింట్ ముంగిట నిలిచిన సబలెంకను నిలువరించిన ఆమంద.. ఆ సెట్‌ను టైబ్రేకర్‌కు తీసుకెళ్లింది. టైబ్రేకర్‌లో సబలెంక ఒత్తిడిలో అద్భుతంగా రాణించింది.

టైబ్రేకర్‌ను తప్పక నెగ్గాల్సిన ఆమంద ఒత్తిడికి తట్టుకుని నిలువలేదు. ఫలితంగా వరుస సెట్లలో లాంఛనం ముగించిన సబలెంక మహిళల సింగిల్స్ చాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆరో సీడ్ నీల్, జో ద్వయం, మహిళల డబుల్స్‌లో మూడో సీడ్ ఎరిన్, గాబ్రియెల జోడీలు విజేతలుగా నిలిచారు.

# అంబేద్కర్ వర్సిటీలో అక్రమాల పాలన

- మంత్రి అచ్చెన్న హెచ్చరించినా తీరు మార్చుకోని వీసీ
- కలెక్టర్ మాటలూ భేఖాతర్
- ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావుకు సైతం నో ఎంట్రీ
- రెక్టార్ ను రిజిస్ట్రార్ స్థానంలోకి తీసుకొచ్చేందుకు తెరవెనుక కుట్ర
- విశ్రాంత ఏయు ఉద్యోగిని ఎస్.ఓగా నియమించుకొని రెండు లక్షలతో సకల విలాసాల కల్పన
- వీసీ రజిని అక్రమ పాలనపై ప్రభుత్వ నిఘా వర్గం దృష్టి






**శ్రీకాకుళం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 7:** ఉత్తరాంధ్రలోని ప్రతిష్టాత్మక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం అవినీతి, అక్రమాల పాలనతో అల్లాడుతోంది. వైకాపా పాలనలో నియామకమైన వీసీ ఆచార్య రజిని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరించి పదవిలో కొనసాగుతుండటం విధితమే. ఈ నేపథ్యంలోనే పలుమార్లు జిల్లా సీనియర్ మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ వర్సిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాల ప్రక్రియలపై హెచ్చరించినప్పటికీ వీసీ రజిని వాటిని పెడచెవిన పెట్టి తన పని తాను చేసుకుపోతుండడం గమనార్హం. నిరంతరం అభద్రతాభావంతో పాలనపై పట్టు లేక.. స్వీయ నిర్ణయాలు తీసుకుంటున్న.. ఉపకులపతి కార్యాలయం ఇప్పటికే పలు పర్యాయాలు అపహాస్యం పాలైంది. ఈ పరిణామాలను గ్రహించిన అమరావతిలోని రాష్ట్ర ప్రభుత్వ నిఘా విభాగం వీసీ రజనీ తీరుపై సమగ్ర నివేదిక రూపకల్పనకు సిద్ధమైంది.

### పరిపాలన భవనం ప్రారంభోత్సవంతో పట్టు కోల్పోయిన మంత్రి, కలెక్టర్

అంబేద్కర్ వర్సిటీలో ఇటీవల జరిగిన పరిపాలన భవనం ప్రారంభోత్సవంతో స్థానిక జిల్లా మంత్రి అచ్చం నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ జిల్లాపై పట్టు కోల్పోయారన్న వాదన ప్రభుత్వ వర్గాల్లో వినిపిస్తోంది. దాదాపు 38 కోట్ల రూపాయలతో నిర్మించిన ఈ పరిపాలన భవనం నిర్మాణం తూతూమంత్రంగా ప్రారంభమైపోవడంతో మంత్రి నారా లోకేష్ కార్యాలయం తీవ్రంగా పరిగణించింది. వాస్తవానికి ఇతర జిల్లాల్లో అయితే ఇంత భారీ బడ్జెట్ తో నిర్మించిన భవన నిర్మాణానికి ముఖ్యమంత్రిని, విద్యాశాఖ మంత్రిని పిలిపించడం ఆనవాయితీ. కానీ వైకాపా ప్రభుత్వంలో నియమితులైన వీసీ రజిని జిల్లాలోని వైసీపీ సీనియర్ నాయకుల సలహాతో కూటమి ప్రభుత్వ పెద్దలను పరిపాలన భవనం నిర్మాణ ప్రారంభోత్సవానికి స్వీయ ప్రణాళిక ప్రకారమే ఆహ్వానించలేదని ఇంటెలిజెన్స్ విభాగం అంచనా వేసింది.

### ధర్మాన శిష్యుడిని రిజిస్ట్రార్ గా నియమించేందుకు సర్వం సిద్ధం

అంబేద్కర్ వర్సిటీలో వైకాపా మార్క్ పాలనతో ఇప్పటికే అభాసుపాలైన వీసీ రజిని తాజాగా మరో ఎత్తుగడకు ప్రణాళిక సిద్ధం చేసింది. వర్సిటీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళిక రచించుకున్న ఆమె తన అనుకున్న విధంగా ఆర్థిక లావాదేవీలు ముందుకు తీసుకెళ్లేందుకు ప్రస్తుతం రెక్టార్‌గా ఉన్న, వైకాపా సీనియర్ నాయకుడు ధర్మాన ప్రసాదరావు శిష్యుడు ఆచార్య బి. అడ్డాయిని రిజిస్ట్రార్ స్థానంలో కూర్చో బెట్టేందుకు సిద్ధమవుతోంది. వాస్తవానికి రిజిస్ట్రార్ పదవి కన్నా రెక్టార్(ప్రో వైస్ ఛాన్సలర్) పదవి హోదాలో పెద్దది. ప్రస్తుతం రెక్టార్‌గా ఉన్న అడ్డాయిని రిజిస్ట్రార్ పదవిలో కూర్చోబెడితే తన అవినీతి, అక్రమాలకు అడ్డు ఉండ దనుకున్న వీసీ రజిని ఈ నిర్ణయం తీసుకుంటున్నారని నిఘా విభాగం గుర్తించింది. రెక్టార్‌గా ఉన్న అడ్డాయికి జిల్లాలో ఉన్న వైసీపీ నేతలు అందరితో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈయన కుటుంబం వైసీపీ తరపున ప్రత్యక్ష రాజకీయాల్లో సైతం పోటీ చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంతోనే అడ్డాయినితన వద్ద రిజిస్ట్రార్‌గా నియమించుకుంటే ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన దస్త్రాలకు అడ్డు ఉండదని వీసీ రజిని భావిస్తోంది. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆచార్య రజిని రీసెర్చ్ గైడ్ గా ఉంటూ డాక్టరేట్ ప్రధానం చేశారు. గత ప్రభుత్వంలో బొత్స సహకారంతో వీసీ పదవిలోకొచ్చిన రజిని అడ్డాయి నియామకానికి సైతం బొత్స అనుమతి రజనీ తీసుకున్నట్లు తెలిసింది.

### ఎమ్మెల్యే ఈశ్వరరావుకు సైతం నో ఎంట్రీ

అంబేద్కర్ వర్సిటీ ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోకి వస్తుంది. ఈ నేపథ్యంలో వర్సిటీ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్న, నూతన భవనాలను ప్రారంభించాలన్న ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యేకి సదురు కార్యక్రమాల పూర్తి వివరాలతో పాటు అన్ని అంశాల్లోనూ ఎమ్మెల్యేను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉంటుంది. అయితే వైకాపా ప్రభుత్వ నియామక వర్సిటీ వీసీ అయిన రజిని మాత్రం ఎచ్చెర్ల నియోజకవర్గ భాజపా ఎమ్మెల్యే ఈశ్వరరావును సైతం వర్సిటీలోకి రానివ్వకుండా లోపాయికారి కుట్రలు సాగిస్తున్నారు. ఇటీవల వీసీ రహస్య పద్ధతిలో ప్రారంభించిన పరిపాలన భవనం విషయంలోనూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వర్ రావు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. అయినప్పటికీ చేసేది లేక, ప్రభుత్వానికి ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. మరోవైపు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే మరో 20 కోట్ల రుసా నిధులను ప్రస్తుతం ఖర్చు చేసే పనిలో వీసీ రజిని నిమగ్నమయ్యారు. ఈ నిధులను ఖర్చు చేసే క్రమంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా ఉండడానికే ప్రస్తుతం రెక్టార్ గా ఉన్న అడ్డాయిని రిజిస్ట్రార్ స్థానంలోకి తీసుకొచ్చేందుకు సర్వం సిద్ధం చేశారు. ఆచార్య అడ్డాయి స్వతహాగా ధర్మాన శిష్యుడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ విసి ప్రసాద్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు. వైకాపా ఎమ్మెల్సీ విక్రాంత్ కు, మాజీ ఎమ్మెల్యే కళావతికి ప్రొఫెసర్ అడ్డాయి నమ్మినబంటుగా ఉంటారు. అలాంటి వ్యక్తిని తీసుకువచ్చి రిజిస్ట్రార్ స్థానంలో కూర్చోబెట్టి దాదాపు 20 కోట్ల నిధులతో అవినీతి పంథాలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీసీ రజిని నడుం బిగించారు.

### ఎస్.ఓ కు రెండు లక్షలతో సకల విలాసాల కల్పన

విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో బోధనేతర విభాగంలో అత్యున్నత ఉద్యోగం నిర్వహించి విశ్రాంతి పొందిన సామ్రాజ్యలక్ష్మిని అంబేద్కర్ వర్సిటీకి పిలిపించుకున్న వీసీ రజిని ఆమెకు స్పెషల్ ఆఫీసర్(ఎస్ఓ) పోస్టు కట్టబెట్టింది. లక్ష రూపాయల వేతనంతో పాటు మరో లక్ష వ్యయంతో సకల విలాసాలను కల్పించింది. సామ్రాజ్యలక్ష్మి కి వర్సిటీ పరిధిలోని ఆర్థిక లావాదేవీల దస్త్రాలపై పట్టు ఉండడంతో వీసీ రజిని తన వద్ద నియమించుకుందన్న విషయాన్ని సైతం ప్రభుత్వం గుర్తించింది. వాస్తవానికి విశ్వవిద్యాలయ చట్టప్రకారం ఎస్ఓ నియమితులయ్యే వారికి ఎలాంటి నిర్ణయాధికారాలు ఉండవు. కానీ సామ్రాజ్యలక్ష్మి వీసీ అండతో పరిపాలన వ్యవస్థ మొత్తాన్ని తన కనుసన్నల్లోకి తెచ్చుకుంది. వీసీ ఆలోచనలకు అనుగుణంగా అవినీతి అక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేయడమే సామ్రాజ్యలక్ష్మి ప్రధాన కర్తవ్యం. సామ్రాజ్యలక్ష్మి సూచనతోనే రెక్టార్ గా ఉన్న అడ్డాయిని రిజిస్ట్రార్ స్థానంలో కూర్చోబెడితే తమ అవినీతికి అడ్డు అదుపు లేకుండా ఉంటుందని వీసీ రజిని ఈ నిర్ణయం తీసుకుంటున్నారన్న విషయాన్ని ఇటు అంబేద్కర్ వర్సిటీ వర్గాలు, అటు ప్రభుత్వ నిఘావర్గం ఓ స్పష్టతకు వచ్చింది.







# రైతు హక్కుల కోసం అన్నదాత పోరాటానికి సిద్ధమైన వైఎస్సార్సీపీ

- సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు...
- ఈ నెల 9న "అన్నదాత పోరు" పేరుతో మహా ఉద్యమాన్ని నిర్వహించుదాం - పోస్టర్ ఆవిష్కరణ చేసిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య





**నాయుడుపేట-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 07:** రైతుల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 9న "అన్నదాత పోరు" పేరుతో మహా ఉద్యమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నాయుడుపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన ప్రధాన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### రైతుల వెన్నంటే వైఎస్సార్ కుటుంబం

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ %-% రైతుల కోసం దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఉచిత విద్యుత్‌ను అందజేసి వ్యవసాయానికి కొత్త ఊపు తెచ్చారని, అదే దారిలో మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల అవసరాలను సులభతరం చేశారని అన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చిన ఘనత పూర్తిగా వైఎస్సార్ కుటుంబానికే చెందుతుందని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న ప్రతిసారి రైతులు నష్టపోయారని ఆయన విమర్శించారు. గతంలో అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు కష్టాల్లో పడితే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం రైతుల సమస్యలపై నిర్లక్ష్యం చూపుతోందని తెలిపారు. యూరియా ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### గిట్టుబాటు ధరలు లేక రైతుల నిరాశ

విత్తనాల కొరత, గిట్టుబాటు ధర లేకపోవడం, పంటల ఎగుమతులు ఆగిపోవడం వలన రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారని సంజీవయ్య అన్నారు. వ్యవసాయం లాభసాటిగా ఉంటేనే రైతు సంతోషంగా ఉండగలరని, రైతు సంతోషంగా ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని ఆయన పేర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తోందని, దీనివల్ల రైతు రంగం దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

### రైతుల కోసం 9న ర్యాలీ -మెమొరాండం సమర్పణ

ఈ సందర్భంగా నియోజకవర్గ అబ్జర్వర్ బీరేంద్ర వర్మ మాట్లాడుతూ %-% రాబోయే మంగళవారం (09.09.2025) సూళ్లూరుపేట పట్టణంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి యూరియా బ్లాక్ మార్కెట్, పంటలకు గిట్టుబాటు ధర సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ మెమొరాండం సమర్పించనున్నామని తెలిపారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న నేతలు

ఈ కార్యక్రమంలో మాజీ ఎన్ డి సి సి బి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ కటకం దీపిక, ఎంపిపి ధనలక్ష్మి, పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి, తంబిరెడ్డి మణిరెడ్డి, రూరల్ అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్, సోమశేఖర్ రెడ్డి, పెళ్లకూరు జెడ్పిటీసీ ప్రెస్కిలా, రాహుల్ రెడ్డి, మధు రెడ్డి, మునిస్వామి నాయుడు, రత్న శ్రీ, కన్నలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ "అన్నదాత పోరు" రైతుల కష్టాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి చాటి చెప్పే చారిత్రాత్మక ఉద్యమంగా నిలుస్తుందనే అభిప్రాయం పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు.



# స్మార్ట్‌ఫోన్లతో షార్ట్ ఫిల్మ్‌లకు కొత్త ఊపు

- యువతలోని సృజనను షార్ట్ ఫిల్మ్‌లు వెలికి తీస్తున్నాయన్న నిమ్మల రామానాయుడు
- లఘు చిత్రాలు సామాజిక బాధ్యతను గుర్తుచేస్తున్నాయని వ్యాఖ్య
- షార్ట్ ఫిల్మ్‌లు కొత్త టాలెంట్‌కు మంచి అవకాశమన్న మంత్రి




**అమరావతి-సూర్య వాస్తవం:** చేతిలో స్మార్ట్‌ఫోన్ వచ్చిన తర్వాత షార్ట్ ఫిల్మ్‌లకు విపరీతమైన ఆదరణ పెరిగిందని, అవి నేటి యువతలోని సృజనాత్మకతను వెలికితీయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఈరోజు పాలకొల్లులో జాతీయ తెలుగు సారస్వత పరిషత్తు నిర్వహించిన నాలుగో అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో యువత అద్భుతమైన ఆలోచనలతో ముందుకు వస్తోందన్నారు. కేవలం వినోదం పంచడమే కాకుండా, సమాజంలో బాధ్యతను గుర్తుచేసే ఎన్నో మంచి లఘు చిత్రాలు వస్తున్నాయని ప్రశంస ించారు. షార్ట్ ఫిల్మ్‌లు కొత్త దర్శకులు, నటీ నటులకు తమ ప్రతిభను ప్రపంచానికి చూపించడానికి ఒక మంచి వేదికగా మారాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమకు పాలకొల్లు అందించిన సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. దిగ్గజ దర్శకులు దాసరి నారాయణరావు, కోడి రామకృష్ణ మొదలుకొని ప్రముఖ నటులు అల్లు రామలింగయ్య, గీత రచయిత అనంత శ్రీరామ్, దర్శకుడు రేలంగి నరసింహారావు వంటి ఎందరో గొప్ప కళాకారులు ఈ గడ్డ నుంచే వచ్చారని ఆయన పేర్కొన్నారు. యువత వారిని స్ఫూర్తిగా తీసుకుని రాణించాలని ఆకాంక్షించారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )